ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
జిల్లా వార్తలు
శుక్రవారం 28 ఫిబ్రవరి 2025



భువనేశ్వరీ సమేత మూలస్థానేశ్వరునికి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

ముక్కంటి కల్యాణం..
మురిసెను ముల్లోకం



ఆదిదంపతుల వివాహాన్ని కనులారా వీక్షిస్తున్న భక్తజనం

తరలివచ్చిన భక్తులే అతిథులుగా.. ఆకాశమే పందిరిగా.. భూలోకమే పీటలుగా.. వేదపండి తుల మంత్రోచ్చర ణలు.. మంగళవాయిద్యాల నడుమ భువనేశ్వరీ సమేత మూలస్థానేశ్వర స్వామివారి కల్యాణం గురువారం రాత్రి అట్టహాసంగా జరిగింది. నగరంలోని మూలపేటలోని మూలస్థానేశ్వ రాలయంలో శివరాత్రి ఉత్సవాలు అంతరంగ వైభవంగా జరుగుతున్నాయి. శివరాత్రి పర్వదినం సందర్భంగా బుధవారం రాత్రి ఆలయంలో భక్తులు జాగరణ చేశారు. ఆ తర్వాత గురువారం ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. కాగా, రాత్రి ఆదిదంపతుల కల్యాణాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కల్యాణమూర్తులైన మూల స్థానేశ్వరస్వామి భువనేశ్వరి అమ్మవారికి ఎదురుకోలు ఉత్సవం జరిగింది. ఆలయ ఈవో అర్చభూమి శ్రీనివాసులురెడ్డి, అర్చకులు, ఉభయకర్తలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. శుక్రవారం ఉదయం 9 గంటలకు స్వామి, అమ్మవార్లు రథంపై కొలువుదీరి పురవీధుల్లో విహరించనున్నారు.

- నెల్లూరు (సాంస్కృతికం)

ఇంటర్ పరీక్షలకు
సర్వం సిద్ధం

శనివారం నుంచి జరిగే ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలకు జిల్లా యంత్రాంగం పటిష్ట ఏర్పాట్లు చేసింది. మార్చి 20వ తేదీ వరకు 79 కేంద్రాల్లో ఈ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు జిల్లా పరీక్షల కమిటీ కన్వీనర్, ఇంటర్‌బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి ఆదూరు శ్రీనివాసులు తెలిపారు. గురువారం నగరంలోని కేవీసీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రైవేట్ కళాశాలల ప్రతినిధులు, చీఫ్, అడిషనల్ చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులు, ఫ్లైయింగ్, సిట్టింగ్‌స్క్వాడ్ సిబ్బందితో ఆయన సమీక్షించారు. పరీక్షల నిర్వహణలో అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తప్పవని ఆర్ఐఓ హెచ్చరించారు. అనంతరం పరీక్షల ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. పరీక్షల నిర్వహణకు సంబంధించిన పూర్తి వివరాలను మీడియాకు తెలిపారు.

- రేపటి నుంచి 79 కేంద్రాల్లో నిర్వహణ
- 53,200 మంది విద్యార్థుల హాజరు
- హై పవర్ కమిటీతో పర్యవేక్షణ
- ప్రతి కేంద్రాల్లోనూ సీసీ కెమెరాలతో నిఘా
- అధికారుల సమీక్షలో ఆర్ఐఓ శ్రీనివాసులు



అధికారులతో మాట్లాడుతున్న ఆర్ఐఓ శ్రీనివాసులు

నెల్లూరు (విద్య), ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : 'ఇంటర్ పరీక్షలు ప్రతిరోజు ఉదయం 9 నుంచి మధ్నాహ్నం 12 గంటల వరకు జరుగుతాయి. 8.30 గంటలకే పరీక్షా విద్యార్థులకు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలి. నిర్ణీత సమయం దాటాక సహేతుక కారణాలతో కేంద్రానికి చేరుకునే విద్యార్థులను చీఫ్ సూపరింటెండెంట్ పరిశీలించి 2 నుంచి 5 నిమిషాల ఆలస్యం వరకు కేంద్రంలోకి అనుమతిస్తారు. ఇక పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు 1400 మంది సిబ్బందిని, హైపవర్ కమిటీతోపాటు జిల్లా పరీక్షల కమిటీ, 4 ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, 5 సిట్టింగ్ స్క్వాడ్‌లు నియమించాము. విద్యార్థులకు పూర్తిస్థాయి వసతులు కల్పించడంతోపాటు ప్రతి గదిలోనూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాము. కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయడంతోపాటు జెరాక్స్ కేంద్రాలను మూసివేయాలని ఆదేశాలు జారీ చేశాము.

ఇంటర్ విద్యార్థులు	53,200 మంది
జూనియర్లు	28,176 మంది
సీనియర్లు	25,024 మంది
పరీక్ష కేంద్రాల సంఖ్య	79
సమస్యాత్మక కేంద్రాలు	12
సమయం	ఉదయం 9 నుంచి 12 గంటల వరకు
అధికారులు	1400 మంది
కంట్రోల్ రూం నెం.	0861-2320312

నిబంధనలు కఠినం

పరీక్షలకు నియమించిన అధికారుల సెల్‌ఫోన్లను జీపీఎస్ సిస్టమ్ ద్వారా ఇంటర్‌బోర్డు ట్రాకింగ్ చేస్తుంది. విద్యార్థులు, ఇన్విజిలేటర్లు ఎవరూ ఎల్‌ఫోన్‌లు, క్యాలుకులేటర్లు వంటి వస్తువులు, కాగితాలను తీసుకెళ్లకూడదు. ఫీజులు చెల్లించలేదని, ఇతర కారణాలతో కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులకు హాల్‌టికెట్లు ఇవ్వకుండా ఇబ్బంది పెడితే అటువంటి వారిపై కఠిన చర్యలు తప్పవు. విద్యార్థులే నేరుగా హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం కల్పించాము. హాల్‌టికెట్‌పై కళాశాల స్టాంపింగ్, ప్రిన్సిపాల్ సంతకం లేకున్నా పరీక్షకు అనుమతిస్తామని తెలిపారు. అలాగే ఈ ఏడాది లాటరీ పద్ధతిలో ఇన్విజిలేటర్లకు గదులను కేటాయిస్తామని, సిబ్బంది గుర్తింపు కార్డులు ధరించి పరీక్షలకు హాజరవ్వాలి. ఎవరైనా మాల్ ప్రాక్టీస్‌కు గురైతే పరీక్ష ముగిసిన తరువాత ఆ విద్యార్థిని వారి తల్లిదండ్రులకు లేదా కళాశాల యాజమాన్యానికి అప్పగించాలి.



కేవీసీ కళాశాలలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆర్ఐఓ

12 సమస్యాత్మక కేంద్రాలు

జిల్లాలో 79 పరీక్షా కేంద్రాలలో 12 కేంద్రాలను సమస్యాత్మకంగా గుర్తించాము. వీటిపై ప్రత్యేక దృష్టి సారించి ఎలాంటి ఇబ్బందులు లేకుండా పరీక్షలు నిర్వహించేలా ఏర్పాట్లు పూర్తయ్యాయి. అలాగే పోలీస్ స్టేషన్లలో ఉన్న ప్రశ్నపత్నాలను పరీక్షకు అర్థగంట ముందు స్టేషన్ నుంచి తీసుకెళ్లేలా అధికారులకు ఆదేశాలిచ్చాము. ఇక ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు స్క్రైబ్ సౌకర్యంతోపాటు పరీక్ష కేంద్రంలోనే కింద గదుల్లో పరీక్ష రాసే వెసులుబాటు కల్పించాము. పరీక్షల నిర్వహణలో ఏవైనా ఇబ్బందులు ఉంటే ఆర్ఐఓ కార్యాలయంలోని కంట్రోల్ రూమ్‌కు ఫోన్ చేయవచ్చు.' అని అన్నారు. ఈ సమావేశంలో డీఈసీ సభ్యులు దీనదయాళ్, వేణుగోపాల్, కొండయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

అడల్ట్ బీసీజీ లక్ష్యంలో జిల్లా ఫస్ట్!

- 78 శాతం వ్యాక్సిన్ వేసిన ఆరోగ్య సిబ్బంది

నెల్లూరు (వైద్యం) ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో క్షయను నివారించేందుకు కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ వృద్ధులకు అడల్ట్ బీసీజీ (బేసిలస్ కల్మిటి గూరిన్) వ్యాక్సిన్‌ను అందుబాటులోకి తెచ్చింది. గత ఏడాది మే 16వ తేదీన 60 ఏళ్ల పైబడిన వృద్ధులకు ఈ వ్యాక్సిన్ వేసేందుకు శ్రీకారం చుట్టారు. ప్రతి గురువారం వైద్యసిబ్బంది వృద్ధులకు ఈ వ్యాక్సిన్ వేస్తున్నారు. రాష్ట్రంలో చాలా జిల్లాలు ఇప్పటివరకు 40 శాతం కూడా వ్యాక్సిన్ వేయలేదు. అయితే వైద్యాధికారుల చేసి కృషి ఫలితంగా వృద్ధులకు వ్యాక్సిన్ వేయడంలో రాష్ట్రంలోనే నెల్లూరు ప్రథమ స్థానంలో నిలిచింది. జిల్లాలో 6,89,286 మందికి 78 శాతం మందికి వ్యాక్సిన్ వేశారు. వైఎస్సార్ కడప జిల్లా రెండవ స్థానంలో నిలిచింది. మార్చి నెలాఖరు వరకు గడువు ఉండటంతో పూర్తి లక్ష్య సాధనకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

కుష్ఠు నివారణకు కృషి చేయండి

కుష్ఠువ్యాధి నివారణలో అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ ఖాదర్‌వలి ఆదేశించారు. గురువారం డీఎంహెచ్‌వో కార్యాలయంలోని కుష్ఠు విభాగంలో ఆయన అధికారులతో సమీక్షించారు. ఇటీవల కుష్ఠువ్యాధిని గుర్తించే సర్వే పూర్తయిందన్నారు. ఇందులో 28 మంది కొత్త వారిని గుర్తించినట్లు చెప్పారు. వీరికి సకాలంలో వైద్య సేవలు అందేలా కృషి చేయాలని సూచించారు. వ్యాధిగ్రస్తులకు అంగ వైకల్యం ఉంటే వారిని డీఎఫ్ఐటీ ఆసుపత్రికి పంపించాలని ఆదేశించారు. ఈ సమీక్షలో వైద్యులు సురేంద్రబాబు, నరసింహులు, ప్రసాదాచారి తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ వివరాలు యాప్‌లో నమోదు చేయాలి

నెల్లూరు (హరనాథపురం) : ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ వివరాలను యాప్‌లో నమోదు చేయాలని డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ నాగరాజకుమారి వెలుగు సిబ్బందిని ఆదేశించారు. గురువారం ఆమె చాంబర్ నుంచి ఉద్యోగులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. శనివారం ఉదయమే పింఛన్ల పంపిణీ ప్రారంభమవుతుందన్నారు. 300 మీటర్ల కంటే ఎక్కువ దూరంలో ఉన్న లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ జరిగినప్పుడు అందుకు గల కారణాలను యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. ప్రతి ఒక్కరి ఇంటి వద్దకు వెళ్లి పింఛన్ పంపిణీ చేసిన తర్వాత వివరాలు యాప్‌లో నమోదు చేయాలన్నారు. కాగా, జిల్లాలో 3,07,232 మంది పింఛనుదారులకు రూ.132.6 కోట్ల పింఛన్ మొత్తాన్ని శనివారం పంపిణీ చేయనున్నారు.



ముమ్మరంగా సాగుతున్న వరికోతలు

మార్చి నెలాఖరుకు పూర్తయ్యే అవకాశం

రెండో పంట మాటేమిటి!?

సోమశిల, కండలేరు ప్రాజెక్టుల్లో పుష్కలంగా నీరు

నీటి కేటాయింపుల కోసం రైతాంగం ఎదురుచూపు

నెల్లూరు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి నెల్లూరు జిల్లాలో మొదటి పంట చివరి దశకు చేరుకుంది. గూడూరు, నాయుడుపేట డివిజన్లలో వరి కోతలు దాదాపుగా పూర్తవగా, నెల్లూరు, కావలి, ఆత్మకూరు డివిజన్లలో ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ సీజన్‌లో ప్రాజెక్టుల్లో పుష్కలంగా నీరు ఉండడంతో సకాలంలో సాగు మొదలైంది. నవంబరులోనే చాలా వరకూ నార్లు పోశారు. దీంతో మార్చి నెలాఖరుకు వరి కోతలు పూర్తయ్యే అవకాశం ఉన్నట్లు వ్యవసాయ శాఖాధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో రెండో పంట మాటేమిటన్న చర్చ జరుగుతోంది. రెండో పంటపై అధికారుల నిర్ణయం కోసం రైతాంగం ఆశగా ఎదురు చూస్తోంది. గతేడాది రెండో పంట ఊసేలేదు. అయితే ప్రస్తుతం సోమశిల, కండలేరు ప్రాజెక్టుల్లో పుష్కలంగా నీటి నిల్వలు ఉన్నాయి. దీంతో ఆ నీటితో ఎంత ఆయకట్టు వరకు సాగుకు నీటి కేటాయింపులు ఇస్తారన్నది చర్చనీయాంశమైంది. అధికారుల నిర్ణయం ఆధారంగా రైతులు వరి పంట వేసుకోవాలా!? లేదా ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలా!? అన్నది ఆధారపడి ఉంది. ప్రస్తుతం సోమశిలలో 59.57 టీఎంసీలు నీరు ఉంది. మొదటి పంట పూర్తయ్యేందుకు మరో ఆరేడు టీఎంసీలు అవసరమవుతాయని జలవనరుల శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ఇక డెడ్ స్టోరేజీ, తాగునీటి అవసరాలు, నీటి ఆవిరి, గణేష్ నిమజ్జనం, రొట్టెల పండుగ వంటి అవసరాలకు మరో 17 టీఎంసీలు వరకూ అవసరమవుతాయి. ఈ లెక్కన నికరంగా సోమశిలలో రెండో పంటకు 35 టీఎంసీల వరకూ మిగిలే అవకాశముంది. ఆ నీటితో సోమశిల ప్రాజెక్టు కింద 3 లక్షల ఎకరాల వరకూ రెండో పంటకై ఆయకట్టుకు నీరిచ్చే వీలు ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. అలానే కండలేరులో ప్రస్తుతం 51.938 టీఎంసీలు నీరు నిల్వ ఉంది. ప్రస్తుత సాగుకు మరో రెండు టీఎంసీల వరకూ అవసరమవుతాయని అంచనా. ఇక డెడ్ స్టోరేజీ, చెన్నై, ఉమ్మడి జిల్లా తాగునీటి అవసరాలు, పరిశ్రమలకు నీటి అవసరాలు, నీటి ఆవిరి అన్నీ కలుపుకుంటే మరో 25 టీఎంసీల వరకూ అవసరమవుతాయి. వీటన్నింటికీ పోను కండలేరులోనూ నికరంగా 25 టీఎంసీలు రెండో పంటకు మిగలనున్నాయి. ఆ నీటితో ఉమ్మడి జిల్లా పరిధిలో రెండు లక్షల ఎకరాలకుపైగా సాగుకు ఇచ్చేందుకు వీలు కలుగుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. మొత్తంగా చూసుకుంటే సోమశిల, కండలేరు జలాశయాల పరిధిలో రెండో పంట కింద ఈ ఏడాది ఐదు లక్షల ఎకరాలకు తగ్గకుండా సాగుకు నీరిచ్చేందుకు అవకాశాలు ఉన్నాయి. దీంతో రైతాంగం కూడా సంతోషంగా ఉంది. అయితే కేటాయింపులపై అధికారులు త్వరగా నిర్ణయం తీసుకోవాలని వారు కోరుతున్నారు.

వందశాతం లక్ష్యాలు సాధించాలి

వైద్యాధికారులతో ఉప సంచాలకుడు శ్రీనివాసులరెడ్డి



వైద్యాధికారులతో మాట్లాడుతున్న ఉప సంచాలకుడు శ్రీనివాసులరెడ్డి

నెల్లూరు (వైద్యం) ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ రూపొందించిన ప్రగతి కార్యక్ర మాలు 100 శాతం లక్ష్యాలు సాధిం చేలా కృషి చేయాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులను ఉపసంచాలకుడు శ్రీనివాసులరెడ్డి ఆదేశించారు. గురువారం నెల్లూరు పర్యటనకు వచ్చిన ఆయన డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత చాంబర్‌లో అధికారులతో మాట్లాడారు. అలాగే జీజీహెచ్‌లో సూపరింటెండెంట్ డాక్టర్ సిద్ధానాయక్‌తోనూ చర్చించారు. అనంతరం శ్రీనివాసులరెడ్డి మాట్లా డుతూ జనన, మరణాలను సకాలంలో ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. ఆసుపత్రిలో బిడ్డ పుట్టిన వెంటనే వారికి ఆధార్ నమోదు చేయాల న్నారు. శిశుఆధార్, జనన ధ్రువీకరణ పత్రం జారీ అయ్యేలా జిల్లా వైద్యాధికారులకు సూచనలిచ్చారు. జీజీహెచ్‌లో శిశు ఆధార్ నమోదు కేంద్రాన్ని పరిశీలించిన ఆయన ప్రతి ఒక్కరూ ఆయా కేంద్రాన్ని సద్వినియోగం చేసుకునేలా కృషి చేయా లని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం ఏపీ మెడి కల్ అండ్ హెల్త్ స్టాటిస్టికల్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డెమో కనకరత్నం, స్టాటికల్ అధికారి కే. సహన, డిప్యూటీ ఎస్‌వో మల్లికార్జున, డీపీహెచ్ ఎన్‌వో మంజుల, డీపీవో డాక్టర్ రమేష్ పాల్గొన్నారు.

శాస్త్రీయ సలహా మండలి సమావేశం రేపు

నెల్లూరు (వ్యవసాయం) : నెల్లూరు కృషి విజ్ఞాన కేంద్రంలో (కేవీకే) శనివారం శాస్త్రీయ సలహా మండలి సమావేశం జరుగుతుందని కేవీకే సమన్వయకర్త డాక్టర్ జి.లలితాశివజ్యోతి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో రైతులు పాల్గొని పంటల్లో వచ్చే సమస్యలను శాస్త్రవేత్తల దృష్టికి తీసుకొచ్చి సలహాలు, సూచనలు తీసుకోవాలని కోరారు.

ఈ నెల 25న బడ్జెట్‌పై అధికారులతో సమావేశమైన మేయర్ స్రవంతి



బడ్జెట్ రూపకల్పనలో బయటపడ్డ సమన్వయలోపం

కార్పొరేషన్‌లో
ఎవరికివారే!

- మేయర్, కమిషనర్లు వేర్వేరుగా సమీక్షలు
- తలలు పట్టుకుంటున్న అధికారులు

నెల్లూరు (సిటీ), ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు కార్పొరేషన్ అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లడంలో మేయర్, కమిషనర్లు జోడెద్దులాంటి వాళ్లు. ఇందులో ఎవరు వెనకడుగు వేసినా, ముందుకెళ్లిన పాలనపై తీవ్ర ప్రభాం చూపుతుంది. ఇప్పుడు నగర పాలక సంస్థలో అదే జరుగుతోంది. మేయర్ స్రవంతి, కమిషనర్ సూర్యతేజల మధ్య ఇప్పటి వరకు ఉన్న కోల్డ్ వార్ కాస్త రోడ్డెక్కింది. వీరి మధ్య సమన్వయలోపం పూర్తిగా గాడితప్పిందన్న సంకేతాలు తాజాగా నిర్వహించిన బడ్జెట్ సమీక్షల ద్వారా బట్టబయలైంది. 2025-26 ఆర్థిక ఏడాదికి నూతన బడ్జెట్‌ను రూపొందించడానికి మంగళవారం మేయర్ స్రవంతి కార్పొరేషన్‌లోని తన ఛాంబరులో విభాగాధిపతులతో సమీక్షించారు. అన్ని రంగాలను బేరీజు వేసుకుని పొద్దు రూపకల్పన చేయాలని సూచించారు. కాగ గురువారం తన చాంబరులో కమిషనర్ సూర్యతేజ ఇదే బడ్జెట్ రూపకల్పనపై విభాగాధిపతులతో సమీక్షించి కేటాయింపులపై ఆరా తీశారు. ఒకే బడ్జెట్‌పై అటు మేయర్, ఇటు కమిషనర్లు రోజుల వ్యవధిలో సమీక్షలు నిర్వహించి కేటాయింపులపై వ్యత్యాసాలతో కూడిన పొద్దులను సిఫారసు చేయడం అధికారులకు తలనొప్పిగా మారింది.

గత కొన్నిరోజులుగా కోల్డ్‌వార్

కార్పొరేషన్‌లో మేయర్, కమిషనర్‌ల మధ్య కొన్ని రోజులుగా కోల్డ్‌వార్ నడుస్తోంది. కమిషనర్ నూతన వాహనం కొనుగోలు చేయాలని ఫైలు తయారు చేసి ఆమోదానికి మేయర్ వద్దకు పంపగా ఆమె తిరస్కరించినట్లు సమాచారం. అక్కడ నుంచి ఇరువురి మధ్య సమన్వయ లోపం అనేక అంశాల్లో హెచ్చుతగ్గులతో వస్తోంది. చెత్త వాహనాలకు డీజిల్ సప్లయ్ చేస్తున్న పెట్రోల్ బంకును మార్చాలని మేయర్ పట్టుపట్టడం, దానికి కమిషనర్ ససేమీరా అనడం అప్పట్లో కార్పొరేషన్‌లో చర్చనీయాంశంగా మారింది. ఇటీవల కమిషనర్ సీసీ ప్రవీణ్ మేయర్ పేషీలో ప్రింట్లు తీస్తుండగా ఆమె భర్త జయవర్ధన్ తలుపులేయడం అనంతరం సీసీ ఫిర్యాదుతో జయావర్ధన్‌ను పోలీసులు అరెస్ట్ చేయడం వీరి మధ్య మరింత దూరం పెరిగేలా చేసింది. తాజాగా బడ్జెట్ సమావేశాలు సైతం ఇరువురు వేర్వేరుగా నిర్వహించడం నగరంలోని రాజకీయ, అధికార వర్గాల్లో చర్చకు దారి తీస్తోంది.



గురువారం తన చాంబర్‌లో అధికారులతో సమావేశమైన కమిషనర్ సూర్యతేజ

ఆకట్టుకున్న సైన్సు ఎగ్జిబిషన్

కావలిటౌన్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): జాతీయ సైన్సు దినోత్సవ ప్రతిభాపాటవ పోటీల్లో భాగంగా జేవీవీ ఆధ్వర్యంలో గురువారం రెడ్‌క్రాస్ భవనంలో జరిగిన వైజ్ఞానిక ప్రదర్శన ఆకట్టుకుంది. జేవీవీ అధ్యక్షుడు తోట వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా జేవీవీ గౌరవాధ్యక్షుడు డాక్టర్ బెజవాడ రవి కుమార్, డాక్టర్ మాలిని, డాక్టర్ రమ్య, డాక్టర్ లక్ష్మీనారాయణమ్మ, అనూషారెడ్డిలు పాల్గొని ఎగ్జిబిట్స్‌ను తిలకించి విద్యార్థులను అభినందించారు. వైద్యులు మాట్లాడుతూ ఇటు వంటి సైన్సు ప్రదర్శనలతో విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, చైతన్యం పెంపొందించడానికి దోహదపడతాయన్నారు. ప్రముఖ సామాజిక గాయకులు రామచంద్రయ్య, రమణయ్యలు సైన్సు ఆవశ్యత ఔనత్యాన్ని చాటుతూ పాడిన పాటలు ఉత్సాహాన్ని నింపాయి. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ రవిప్రకాష్, జేవీవీ కార్యదర్శి హరనాథ్, సుబ్బరాయశర్మ పాల్గొన్నారు.


సైన్సు ఎగ్జిబిట్స్ ప్రదర్శిస్తున్న విద్యార్థులు

చెత్తతో సంపదపై అవగాహన ఉండాలి : డీఎల్‌పీవో


మొక్క నాటుతున్న డీఎల్‌పీవో క్రిష్ణమోహన్

కొండాపురం, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): చెత్త నుంచి సంపద తయారీపై ఈవోపీఆర్‌డీలకు అవగాహన ఉండాలని కందుకూరు డీఎల్‌పీవో క్రిష్ణమోహన్ అన్నారు. డివిజన్ పరిధిలోని 7 మండలాల ఈవోపీఆర్‌డీలకు మండలంలోని గొట్టిగుండాలలో గురువారం జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కేంద్రాల్లో తయారు చేసి న సేంద్రియ ఎరువును రైతులకు విక్రయిం చడం ద్వారా వచ్చే నిధులతో పంచాయ తీలలో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిం చుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. నెల్లూరు నుంచి వచ్చిన రిసోర్స్ పర్సన్ రమేష్ ఇళ్ల నుంచి చెత్తను ఎలా సేకరిం చాలి, కేంద్రానికి చేరిన తర్వాత తడి, పొడి చెత్తను ఎలా వేరుచేయాలి అనే విషయా లపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఆదినారాయణ, ఈవోపీఆర్‌డీ లతోపాటు పంచాయతీ కార్యదర్శులు, సర్పంచు డి.కొండలరావు, ఎంపీటీసీ వేమిరెడ్డి మల్లికార్జున పాల్గొన్నారు.

భూముల రీసర్వేను ప్రజలు వినియోగించుకోండి

● కందుకూరు సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ


అధికారులతో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ తిరుమణి శ్రీపూజ

కొండాపురం, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేపట్టిన భూముల రీసర్వేను ప్రజలు వినియోగించుకోవాలని కందుకూరు సబ్‌కలెక్టర్ తిరుమణి శ్రీపూజ అన్నారు. మండలంలోని కొమ్మి పంచాయతీ కుంకువారిపాలెంలో జరుగుతున్న భూముల రీసర్వేను గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూముల రీసర్వే సమయంలో గ్రామంలోని ప్రజలు ఇతర ప్రాంతాలలో ఉన్నవారు గ్రామానికి వచ్చి తమ భూములకు సంబంధించిన సమగ్ర విషయాలను తెలుసుకోవాలన్నారు. సర్వేయర్లు అన్ని వివరాలను రైతులకు తెలియచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు ఎమ్.కోటేశ్వరరావు, వీఆర్‌వో మహేష్, సర్వేయర్ల బృందంతోపాటు గ్రామ రైతులు పాల్గొన్నారు.

టైలర్స్‌కు ప్రభుత్వం రాయితీలు ఇచ్చి ఆదుకోవాలి

కావలి, ఫ్రిబవరి 27(ఆంధ్రజ్యోతి): టైలర్స్ వృత్తిలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నందున ప్రభుత్వం టైలర్స్‌కు రాయితీలు ఇచ్చి ఆదుకోవాలని టైలర్స్ అసోసియేషన్ నాయకులు కోరారు. కావలి జర్నలిస్ట్‌క్లబ్‌లో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో కావలి టైలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.రమేష్, కార్యదర్శి షేక్ రెహమాన్, కోశాధికారి పీ.వేణు, సలహాదారు షేక్ రఫీలు మాట్లాడారు. ఈ సందర్భంగా శుక్రవారం ఉదయం 9 గంటలకు ఆర్టీసీ బస్టాండ్ సెంటర్ నుంచి ఏఎంఎస్ కల్యాణ మండపం వరకు పెద్ద ర్యాలీ నిర్వహించి అనంతరం సభ జరుగుతోందన్నారు. టైలర్స్ అందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో టైలర్స్ అసోసియేషన్ సభ్యులు అల్తాఫ్, రెహమాన్, రసూల్, జమీర్, లక్ష్మయ్య, బద్రీనాథ్, సిరాజ్, శ్రీను, గోపి తదితరులు పాల్గొన్నారు.

సీ, డీ గ్రేడ్ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలి


విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న ఐటీడీఏ ఏఎంవో శాంతకుమారి

సంగం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): చదువులో వెనుకబడి సీ, డీ గ్రేడ్‌లో ఉన్న విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఐటీడీఏ ఏఎంవో శాంతకుమారి ఉపాధ్యాయులకు సూచించారు. గురువారం ఆమె మండలంలోని మర్రిపాడు గిరిజన పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల పిల్లల హాజరు రిజిష్టర్, పాఠశాల రికార్డులను పరిశీలించారు. అనంతరం విద్యార్థుల అంతర్గత సామర్థ్యాలను పెంపొందించాలని సూచించారు. మధ్యాహ్న భోజనం రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం వంగల్లులోని యూపీ, దళితవాడలోని పాఠశాలను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆమె వెంట ఐటీడీఏ జీసీడీవో శాంతి పాల్గొన్నారు.

పదోతరగతి విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ


విద్యాసామగ్రి అందజేస్తున్న వైద్యులు సాహెబ్‌పీర్

దుత్తలూరు (ఉదయగిరి), ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నందిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు గురువారం శ్రీచైతన్య ఐటీఐ, ఉదయగిరి వారి సౌజన్యంతో విద్యాసామగ్రి అంద జేశారు. ఈసందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న కిమ్స్ వైద్యశాల కార్డియాలజిస్టు డాక్టర్ సాహెబ్ పీర్ పరీక్షల సమ యంలో విద్యార్థులు తీసు కోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు, సలహాలు అందజేశారు. వత్తిడిని ఎలా అధిగమించాలి, ఆరోగ్య భద్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐటీఐ కళాశాల కరస్పాండెంట్ ఖాదర్‌బాషా, ప్రిన్సిపాల్ గురవారెడ్డి, ప్రధానోపాధ్యాయుడు శ్రీరాములు, సీనియర్ ఉపాధ్యాయిని ఫాతిమాజాన్, సిబ్బంది పాల్గొన్నారు.

దౌర్జన్యాలకు పాల్పడితే చట్టరీత్యా చర్యలు : సీఐ

ఏఎస్ పేట, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మతిస్థిమితం లేని వారి ఆలన పాలన చూసే కేర్ టేకర్లు దౌర్జన్యాలు చేసిన, హింసించినా చట్టరీత్యా చర్యలు తప్పవని సంగం సీఐ వేమారెడ్డి హెచ్చరించారు. గురువారం ఆయన స్థానిక పోలీస్ స్టేషన్‌లో కేర్ టేకర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తమ వద్ద ఉన్న మతిస్థిమితం లేని వారి ఆధార్ కార్డులతో సహ పూర్తి వివరాలు పోలీస్‌స్టేషన్‌లో అందించాలని, వారికి నెల నెలా వైద్య పరీక్షలు చేయించాలని తెలిపారు. ట్రస్ట్ నిబంధనలు పాటించాలని సూచించారు.

చింతచెట్టు నరికివేతపై ఫిర్యాదు

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాంచెరువు బస్టాండ్ సెంటర్ సమీపంలోని రచ్చబండ వద్ద ఉన్న ఓ చింతచెట్టును అదే గ్రామానికి చెందిన వీఆర్‌ఏ చెన్నకేశవులు నరికివేసినట్లు గురువారం ఆర్‌అండ్‌బీ ఏఈ మస్తాన్‌రావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ చెట్టు జోలికి వెళ్లవద్దని గ్రామస్థులు వారించి నప్పటికీ పట్టించుకోకుండా వీఆర్‌ఏ బుధవారం రాత్రి సమయంలో నరికివేశాడు. దీంతో స్థానికులు ఆర్‌అండ్‌బీ స్థలంలోని చెట్టును అక్రమంగా నరికివేసినట్లు ఏఈకి సమాచారం అందించారు. దీంతో ఆయన ఆదేశాల మేరకు సిబ్బంది గ్రామానికి వెళ్లి పరిశీలించిన అనంతరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

శ్రీశైలంలో కావలి చిన్నారి ప్రతిభ

కావలిటౌన్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి) శ్రీశైలం మహాశివరాత్రి మహోత్సవంలో కావలికి చెందిన చిన్నారి చక్రికాశ్రీ భరతనాట్యంలో అద్భుత ప్రతిభ కనబరిచి నిర్వాహకులు ఆధ్యాత్మిక కళా ప్రముఖుల ప్రశంలందుకుంది. కావలిలో 4వ తరగతి చదువుతున్న శ్రీనివాసరావు నాగమణి దంపతుల కుమార్తె చక్రికాశ్రీ శ్రీశైలం మహాశివరాత్రి మహోత్సవంలో నాట్యప్రదర్శన అందించేందుకు ఎంపికై బుధవారం రాత్రి శ్రీశైలం దేవస్థానంలో జరిగిన నాట్యప్రదర్శనలో ఓం నమ శ్శివాయ భక్తి పాటలకు తన నాట్యప్రతిభా కౌశల్యంతో అందించి భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఆలయ బాధ్యులు చిన్నారిని ప్రత్యేకంగా అభినందించి ప్రశంసాపత్రం జ్ఞాపిక అందించారు.

కమనీయం శివపార్వతుల కల్యాణం


కావలిటౌన్ : నంది వాహనంపై విహరిస్తున్న మల్లన్న

ఉలవపాడు, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజుపాలెం సాయిబాబా మందిరంలో శివరాత్రిని పురష్కరించుకొని గురువారం శివపార్వతుల కల్యాణం కమనీయంగా జరిగింది. ఆలయ ప్రాంగణంలోని ఉమామహేశ్వరులకు బుధవారం రాత్రి లింగోద్భావ కాలంలో రుద్రాభిషేకం జరిగింది. గురువారం ఉదయం జరిగిన స్వామివారి కల్యాణోత్సవంలో కందుకూరు మాజీ ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే మన్నేటికోటలో గంగాపార్వతి సమేత అమరలింగేశ్వర స్వామి కల్యాణం జరిగింది. ఉలవపాడులోని శివాలయంలో చిన్నారుల నాట్యం అలరించింది.


కలిగిరి : గ్రామోత్సవంలో స్వామి, అమ్మవార్లు

నందివాహనంపై మల్లన్న గ్రామోత్సవం

కావలిటౌన్ : కావలి పట్టణం పాతూరులోని రుద్రపాద క్షేత్రంలోని అఖిలాండ బ్రహ్మాండ నాయకుడు శ్రీదుర్గా భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం మల్లన్నకు నందివాహనసేవ, గ్రామోత్సవం నిర్వహించారు. శివాలయం వంశ పారంపర్య ప్రధాన అర్చకులు శశిగురుకుల్ పర్యవేక్షణలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో ఉదయం హోమం, బలిహరణ పల్లకిసేవ, విశేష అభిషేకార్చనలు జరిగాయి. రాత్రి శ్రీదుర్గా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి కల్యాణం కనులపండువగా జరిగింది. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

తగ్గని భక్తుల రద్దీ

లింగసముద్రం : లింగసముద్రంలోని తిరుమణిశెట్టి కోటయ్యస్వామి దర్శనానికి రెండవ రోజూ భక్తుల రద్దీ తగ్గలేదు. పరిసర గ్రామాలకు చెందిన భక్తులు గురువారం కోటయ్యస్వామిని దర్శించుకొని పూజలు చేసి తమ మొక్కులు చెల్లించుకున్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. దీంతో రోడ్లు భక్తులతో కిటకిటలాయి. అంగళ్ల వద్ద కొనుగోలుదారులతో సందడి నెలకొంది.

రామలింగేశ్వరుడి గ్రామోత్సవం

కలిగిరి : పట్టణంలో వెలసియున్న పర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో బుధవారం అర్ధరాత్రి స్వామి, అమ్మవారికి కల్యాణం నిర్వహించారు. అనంతరం విశేష పుష్పాలంకరణతో పట్టణంలో గ్రామోత్సవంలో భక్తులకు దర్శనమిచ్చారు. గురువారం మధ్యాహ్నం భక్తులకు అన్నసంతర్పణ చేశారు.


జలదంకి : పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కాకర్ల

వైభవంగా మహాలింగోద్భవం

జలదంకి : జలదంకిలో గంగాసమేత జానకి రామలింగేశ్వరస్వామి ఆలయంలో బుధవారం అర్ధరాత్రి మహాలింగోద్భావం జరిగింది. అనంతరం అభిషేకం, నందిసేవ, నిర్వహించారు. ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ శివలింగానికి పూజలు చేశారు. గజవాహ నంపై స్వామివారికి గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమాలలో సోమశిల ప్రాజెక్ట్ వైస్‌చైర్మన్ పి.మధురెడ్డి, నాయకులు కే.మాలకొండారెడ్డి, సీహెచ్ జనార్దన్ రెడ్డి, వీ.సుబ్బారెడ్డి, కే.దయాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా సంగమేశ్వరుడి గ్రామోత్సవం

సంగం : సంగమేశ్వరాలయంలో గురువారం తెల్లవారుజామున కామాక్షిదేవి సమేత సంగమేశ్వరస్వామి నంది వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవ విగ్రహాలను గజ పూలమాలలతో అలంకరించారు. అనంతరం పొదలకూరు మండలంలోని సూరాయపాళెంలో గ్రామోత్సవం అనంతరం స్వామివారు ఆలయానికి చేరుకున్నారు. భక్తులు మొక్కులు తీర్చుకున్నారు.


లింగసముద్రంలో భక్తుల కోలాహలం

భీమేశ్వరుడికి అశ్వవాహన సేవ

మండలంలోని వంగల్లు భీమేశ్వరాలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం తెల్లవారుజామున కామాక్షిదేవి, భీమేశ్వర స్వామి ఉత్సవ విగ్రహాలను అశ్వవాహనంపై ఉంచి గజపూలమాలలతో అలంకరించిన అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు.


ఉలవపాడు : శివపార్వతుల కల్యాణంలో మాజీ ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డి

హనుమంతుడి గ్రామోత్సవం

స్థానిక వీరాంజనేయస్వామి ఆలయంలో హనుమంతుని గ్రామోత్సం వైభవంగా జరిగింది. భక్తులు కర్పూర హారతులతో స్వాగతం పలికి మొక్కులు తీర్చుకున్నారు. గ్రామోత్సవంలో మహిళల కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది.


సంగం : నంది వాహనంపై ఊరేగుతున్న శ్రీకామాక్షిదేవి, సంగమేశ్వరస్వామి

కార్యకర్తల సంక్షేమమే టీడీపీ లక్ష్యం : ఇంటూరి


టీడీపీ సభ్యత్వం కలిగిన వారికి గుర్తింపు కార్డుల పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

కందుకూరు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): దేశంలోనే కార్యకర్తల సంక్షేమం కోసం పాటుపడే ఏకైక పార్టీ తెలుగుదేశం అని, అందువల్లే అత్యధిక సభ్యత్వాలు కలిగిన రాజకీయ పార్టీగా టీడీపీ రికార్డు సృష్టించిందని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. టీడీపీ ఇ టీవల చేపట్టిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో సభ్యత్వాలు స్వీకరించిన కార్యకర్తలకు గుర్తిం పు కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని గురువారం ఆయన స్థానిక పార్టీ కార్యాలయం లో లాంచనంగా ప్రారంభించారు. ఈ సంద ర్భంగా మాట్లాడుతూ కోటి సభ్యత్వాల మైలురా యిని దాటడం ద్వారా దేశంలోనే అత్యధిక సభ్యులు కలిగిన రాజకీయ పార్టీగా టీడీపీ ఆవిర్భవించిందన్నారు. తెలుగుదేశం పార్టీ సభ్య త్వం కలిగిన కార్యకర్తల కు అనుకోని ప్రమాదం జరిగితే వారి కుటుంబాలకు అండగా ఉండేం దుకు రూ.5 లక్షల ప్రమాద బీమా అమలు చేస్తుండటమే గాక ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా కూడా కార్యకర్తల కుటుంబాల ఉన్నతికి అనేక కార్యక్రమాలు అమలు చేయటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు దామా మలేశ్వరరావు, మాదాల లక్ష్మీనరసింహం, జనిగర్ల నాగరాజు, పిడికిటి వెంకటేశ్వర్లు, చదలవాడ కొండయ్య, చిలకపాటి మధుబాబు, ముచ్చు శ్రీను, వడ్డెళ్ల రవిచంద్ర, తదితరులు పాలొన్నారు.

సబ్‌కోర్టు పరిధిని కుదించడం శోచనీయం

● కందుకూరు బార్ అసోసియేషన్ వినతి

కందుకూరు, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): కందుకూరు సబ్‌కోర్టు పరిధిని కుదించడం శోచనీయమని, ఇక్కడి నుంచి తప్పించి ఒంగోలు కోర్టు పరిధిలోకి చేర్చిన నాలుగు మండలాలను తిరిగి కందుకూరులోనే కొనసాగించేలా న్యాయశాఖ ఉత్తర్వులు ఇవ్వాలని కందుకూరు బార్ అసోసియేషన్ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వీవీ సుబ్బారావు, సంపత్‌కుమార్, సీనియర్ న్యాయవాదులు మామిళ్లపల్లి మల్లికార్జునరావు, బెజవాడ కృష్ణయ్య చౌదరి, చిడిపోతు హరికృష్ణ, బీవీ మురళీకృష్ణ, షేక్ షంషుద్దీన్, పెట్లూరి మురళి తదితరులు కోరారు. ఈ మేరకు గురువారం ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావును కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ ఉత్తర్వులు అమలైతే కందుకూరుకు తీరని అన్యాయం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కందుకూరు సబ్ కోర్టు పరిధిలో కందుకూరు నియోజకవర్గంతో పాటు కొండపి నియోజకవర్గంలోని పొన్నలూరు, జరుగుమల్లి, కొండపి, సింగరాయకొండ మండలాలు ఉండగా సింగరాయకొండలో నూతనంగా ఏర్పాటు చేసిన అడిషనల్ జూనియర్ సివిల్‌జడ్జి కోర్టులో ఆ నాలుగు మండలాలను చేర్చారని తెలిపారు. అయితే నూతనంగా ఏర్పడిన కోర్టు అప్పీలు పరిధిని కూడా కందుకూరు కోర్టుకు కాకుండా ఒంగోలు ప్రిన్సిపల్ డిస్ట్రిక్టు కోర్టుకు బదలాయిస్తూ ఉత్తర్వులు జారీ చేయడం శోచనీయమని వివరించారు. ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తానని వారికి ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కాగా కందుకూరు కోర్టు పరిధిని కుదించడం పట్ల కందుకూరు నియోజకవర్గ అభివృద్ధి మండలి ప్రతినిధులు తోకల వెంకటేశ్వర్లు, పాలేటి కోటేశ్వరరావు, పులిచర్ల వెంకటసుబ్బారెడ్డి, నరేష్ రాజా తదితరులు ఒక ప్రకటనలో అసంతృప్తి వ్యక్తం చేశారు. కందుకూరు నియోజకవర్గాన్ని నెల్లూరు జిల్లాలో కలపటంతోనే రాష్ట్రంలోనే అతిపెద్ద రెవెన్యూ డివిజన్‌కు తీరని అన్యాయం జరిగిందన్నారు.

ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు


ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తున్న రెవెన్యూ అధికారులు

సంగం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): సంగం పంచాయతీలోని తిరుమనతిప్ప సర్వే నెంబరు 252లో ఉన్న ఖాళీ స్థలం ప్రభుత్వ భూమి అని రెవెన్యూ అధికారులు గురువారం హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. ఈ స్థలంలో ఎవరూ ప్రవేశించరాదు. ప్రవేశించిన శిక్షార్హులని హెచ్చరిక బోర్డులో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు సంధ్య, వీఆర్వో మోహన్ ఉన్నారు.

ఆంజనేయ విగ్రహం ఊరేగింపు

వింజమూరు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎర్రబెల్లిపాలెంలో ప్రతిష్ఠించనున్న ఆంజనేయస్వామి విగ్రహాన్ని గురువారం మేళతాళాలతో భాజాభజంత్రీలతో ఎర్రబెల్లిపాలెం యూత్ ఊరేగింపు నిర్వహిం చింది. వచ్చేనెల 2వతేదీ ఎర్రబెల్లిపాలెం సెం టర్‌లో విగ్రహాన్ని ప్రతిష్టిస్తున్నట్లు తెలిపారు.

4 నుంచి విజ్ఞాన ప్రదర్శనలు

ఉదయగిరి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): వచ్చేనెల 4వ తేదీ నుంచి మండలంలోని 3 నుంచి 9వ తరగతి విద్యార్థులకు స్థానిక సికిందర్ పిక్చర్ ప్యాలెస్‌లో చిల్డ్రన్స్ ఫిలిం ఫెస్టివల్‌లో భాగంగా విజ్ఞాన ప్రదర్శనలు జరగనున్నట్లు ఎంఈవో-2 శ్రీనివాసులు గురువారం తెలిపారు. అందులో భాగంగా సీఆర్‌ఎంటీలతో సమీక్షా సమావేశం నిర్వహించి విధివిధానాలను వివరించారు. ప్రతి విద్యార్థి రూ.30లు చెల్లించి టిక్కెట్ తీసుకోవాల్సి ఉందన్నారు.

దారి ఆక్రమణపై ఫిర్యాదు

కలువాయి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక అరుంధతీయవాడలోని పురాతన మంచినీటి బావికి ఇరువైపులా ఉన్న దారిని కొందరు ఆక్రమించారని గురువారం తహసీల్దారుకు కాలనీవాసులు ఫిర్యాదు చేశారు. పంచాయతీ కార్యదర్శి కూడా ఈవిషయమై ఫిర్యాదు చేశారు. పరిశీలించి న్యాయం చేస్తామని అధికారులు హామీ ఇచ్చారు.

నేడు రిక్షాలు, ఆటోల వేలం

ఉదయగిరి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం శిథిలమైన రిక్షాలు, ఆటోలకు ఆత్మకూరు డివిజనల్ పంచాయతీ అధికారి ఆధ్వర్యంలో వేలంపాటలు నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ షేక్ కరీముల్లా గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తిగలవారు వేలంపాటలో పాల్గొనాలని ఆయన కోరారు.

విమర్శలు మాని, అభివృద్ధికి సహకరించాలి

● ఎమ్మెల్యే కాకర్లపై ఆరోపణలను ఖండించిన టీడీపీ నేతలు


పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతున్న మండల టీడీపీ సీనియర్ నాయకులు

సీతారామపురం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి శాసనసభ్యుడు కాకర్ల సురేష్‌పై నిరాధారమైన ఆరోపణలు మాని అభివృద్ధికి సహకరించాలని మండల టీడీపీ నేతలు సూచించారు. గురువారం మండల పరిధిలోని పొలంగారిపల్లి వద్ద టీడీపీ సీనియర్ నాయకుడు, మండల క్లస్టర్ ఇన్‌చార్జ్ వెంగళశెట్టి వెంకటేశ్వర్లు, మండల మాజీ కన్వీనర్ ముత్తంశెట్టి చెన్నకేశవులు, మండల కన్వీనర్ కప్ప ప్రభాకర్‌రాజు, మాజీ జడ్పీటీసీ కలివెల జ్యోతి పాత్రికేయుల సమావేశం నిర్వహించారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేస్తూ దూసుకుపోతున్న ఎమ్మెల్యే కాకర్లపై అసత్య ప్రచారాలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా ఎస్సీ సెల్ కార్యనిర్వహక అధికార ప్రతినిధి జాషువా, ముస్లిం మైనారిటీ నాయకుడు షేక్ బాబు, జిల్లా బీసీ సెల్ కార్యనిర్వాహక అధికార ప్రతినిధి తురక వెంకటేశ్వర్లు, సర్పంచ్ ఆదినారాయణ, ఎడమ ప్రవీణ్, రమణయ్య, కాశీరత్తయ్య, ఇజ్రాయిల్ వెంగళశెట్టి వెంకట్రావు, పాల్గొన్నారు.

సోమశిల జలాశయం నిర్వహణపై నిర్లక్ష్యం తగదు

● ప్రాజెక్టు చెర్మన్ కేశవ చౌదరి

అనంతసాగరం ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయం నిర్వహణ పట్ల అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సోమశిల ప్రాజెక్టు చెర్మన్ వేలూరు కేశవచౌదరి సూచించారు. గురువారం సోమశిలలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ కొందరు అధికారులు విధుల నిర్వహణ పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందని, మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఉన్నతాధికారులకు సమస్యను వివరించి నిరంతర పర్యవేక్షణ జరిగేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వం రైతులకు మేలు జరి గేలా ఎలాంటి కార్యక్రమాలు చేయలేదని, కూటమి ప్రభుత్వం వచ్చాక రైతుల సంక్షేమం జరుగుతోందన్నారు. ఉత్తర, దక్షిణ కాలువలతో పాటు డెల్టా పరిధిలో చివరి ఆయకట్టు వరకు నీరు ఇవ్వడం జరుగుతుందని స్పష్టం చేశారు.

అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతానికి ప్రభుత్వం శ్రీకారం

● కార్యకర్తలకు ముగిసిన శిక్షణ


శిక్షణ కార్యక్రమంలో కార్యకర్తలు తయారు చేసిన బోధనోపకరణాలు (ఫైల్)

ఉదయగిరి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం నూతన ఒరవడికి శ్రీకారం చుట్టింది. అంగన్‌వాడీ పిల్లలు పాఠశాలల్లో చేరడానికి ముందే వాళ్లని వివిధ అంశాల్లో ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళిక రూపొందించింది అందులో భాగంగా పూర్వ ప్రాథమిక విద్యను బలోపేతం చేసేందుకు కార్యకర్తలకు జ్ఞానజ్యోతి పేరుతో ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. ఏపీ పరివర్తన సహాయ పథకంలో భాగంగా 120 రోజుల పాటు దశల వారీగా శిక్షకులు విద్యావిధానం ప్రాముఖ్యత, అభ్యసన విధానం, సమగ్రాభివృద్ధి, పాఠ్య ప్రణాళిక, పిల్లల్లో శారీరక, మేధ, కళాత్మకాభివృద్ధి, ఎదుగుదల, ఆరోగ్యం, పరిశుభ్రత, పోషణ వంటివి పెంచడమే లక్ష్యంగా శిక్షణ ఇచ్చి ధ్రువపత్రం అందజేశారు. జిల్లాలోని 12 ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఉండగా వాటి పరిధిలో 2,934 అంగన్‌వాడీ ఉన్నాయి. అందులో 229 మినీ కేంద్రాలు ఉన్నాయి. వీటి పరిధిలో 2,673 కార్యకర్తలు పనిచేస్తున్నారు. వారందరికీ ఇటీవల శిక్షణ ఇచ్చారు.

మెరుగైన విద్యాబోధనే లక్ష్యం: సీడీపీవో

అంగన్‌వాడీ కేంద్రాల్లో మెరుగైన విద్యాబోధన చేయడమే లక్ష్యంగా జ్ఞానజ్యోతిపై కార్యకర్తలకు శిక్షణ ఇచ్చినట్లు సీడీపీవో సునీత తెలిపారు. శిక్షణ కార్యక్రమాలు ఇటీవల ముగిశాయని, శిక్షణలో కార్యకర్తలు నేర్చుకున్న అంశాలను కేంద్రాల్లో ఖచ్చితంగా అమలు చేయాల్సి ఉందన్నారు.

దివ్యాంగుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం


దివ్యాంగుల క్యాంపులో పాల్గొన్న అధికారులు

కావలి రూరల్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని దివ్యాంగుల సంక్షేమశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఏ.మహమ్మద్ అయూబ్ పేర్కొన్నారు. స్థానిక ఎమ్మీడీవో కార్యాలయ ప్రాంగణంలో ఎమ్మీ డీవో శ్రీదేవి ఆధ్వర్యంలో గురువారం దివ్యాంగులకు క్యాంపు ఏర్పాటు చేసి వారికి అవసర మైన పరీక్షలు నిర్వహించారు. ఈ క్యాంపు నకు 120 మంది హాజరుకాగా వారిలో 46 మందికి ఉప కరణాలు తప్పనిసరి అని గుర్తించిన జిల్లా అధికారులు వారి పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. లబ్ధిదారులకు ప్రక టించిన తేదీలలో వారికి అవసరమైన ఉప కరణాలు అందిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఏ కొండమ్మ, వెంకటాచలం కాంపోజిట్ రీజనల్ సెంటర్ కో ఆర్డినేటర్ రామాంజులు, దివ్యాంగుల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మండవ వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.

బెల్టుదుకాణంపై దాడి

● 11 మద్యం సీసాల స్వాధీనం

కావలి రూరల్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): కావలి మండలం సర్వాయపాలెంలో ప్రభుత్వ అనుమతులు లేకుండా అనధికారికంగా మద్యం అమ్ముతున్న బెల్టు దుకాణంపై గురువారం ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించారు. సీఐ శ్రీనివాసులు ఆదేశాల మేరకు ఎస్ఐ దేవిక నిర్వహించిన దాడుల్లో మద్యం అమ్మకాలు చేస్తున్న సూరగాని వెంకట్రావును అదుపులోకి తీసుకుని అతని వద్ద 11 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దార్యప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

2న కంటి వైద్యశిబిరం

కావలి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): కావలి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మార్చి 2వ తేదీన పట్టణంలోని రామమూర్తిపేటలోని షిరిడీసాయిబాబా మందిరంలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు రోటరీ క్లబ్ బాధ్యులు డాక్టర్ మాధవరెడ్డి, స్వర్ణలత, మొగల్‌సలీం బేగ్‌లు ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. సుశీల నేత్రాలయం వారు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా ఆరోగ్యశ్రీ కార్డుపై కంటి శస్త్రచికిత్సలు చేస్తారని పేర్కొన్నారు. కావలి డివిజన్ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

మురగళ్ల చెరువులో వలల తొలగింపు దుర్మార్గం : సీపీఎం

నెల్లూరు (వైద్యం,ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఆత్మకూరు రూరల్ మండలం మురగ ళ్లలో దళితులు చేపల పెంపకానికి రక్షణగా వేసుకున్న వలలను తొలగించటం దుర్మార్గమని సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గ్రామంలో దళితు లు మత్స్యకార సొసైటీని ఏర్పాటు చేసుకుని చెరు వులో చేపలు పెంచుకునేందుకు పంచాయతీ అనుమతితో లీజుకు తీసుకున్నారు. చెరువులో రూ. 8లక్షల విలువైన చేపలు వదిలి ఉన్నారని, దీన్ని జీర్ణిం చుకోలేని అగ్రకులాలవారు మంత్రి ఆనం రామనారాయణరెడ్డి దృష్టికి తీసుకెళ్లి మత్స్యకార సొసైటీని రద్దు చేయాలని ఒత్తిడి తెచ్చారన్నారు. అయితే అందుకు కుదరదని చెప్పిన మంత్రికి చెరువు చుట్టూ వేసిన వలలను తొలగించాలని ఒత్తిడి తెచ్చారన్నారు. ఈ క్రమంలో ఈ నెల 24న వేకువజా మున చెరువుకు రక్షణగా ఉన్న వలలను తొలగించారని ఆందోళన వ్యక్తం చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మంగళం పుల్లయ్య తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ మాదాల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య


ధనలక్ష్మి(ఫైల్)

ఉదయగిరి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాల కారణంగా ఇంటి నుంచి వెళ్లిపోయిన ఓ వివాహిత ఉదయగిరి ఆన కట్టలో శవమై తేలిన సంఘటన గురువారం చోటుచేసుకొంది. పోలీ సులు తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని యాదవపాళెంకు చెందిన పువ్వాడి ధనలక్ష్మి (53)కి 35 ఏళ్ల క్రితం వెంకటాద్రితో వివాహమైంది. వారికి ఇద్దరు సంతానం కాగా వివాహాలు అయ్యాయి. కుమారుడు హరినాథ్ తల్లిదండ్రుల వద్దే ఉంటుండగా, కుమార్తె గుంటూరులో ఉంటోంది. హరినాథ్‌కు వివాహమైనప్పటి నుంచి కోడలు శిరీషతో తరుచూ వివాదాలు చోటుచేసుకుంటుండేవి. ఈనేపథ్యంలో బుధవారం సైతం వారి మధ్య వివాదం నెలకొనడంతో ధనలక్ష్మి ఎవరికీ చెప్పకుండా ఇంట్లో నుంచి గుంటూరులోని తన కుమార్తె వద్దకు వెళ్లింది. కుమార్తె ఇంట్లో ఎవరూ లేకపోవడంతో తన వద్ద ఉన్న బంగారు ఆభరణాలను కిటికీలో నుంచి వారి ఇంట్లో వేసింది. అనంతరం అక్కడ ఓ కారును అద్దెకు తీసుకొని అర్ధరాత్రి సమయంలో ఉదయగిరి ఆనకట్ట వైఎస్ఆర్ సర్కిల్ వద్ద దిగి సమీపంలో ఉన్న ఆనకట్ట నీటిలో దూకి ఆత్మహత్య చేసుకొంది. కాగా, తెల్లవారుజామున ఆనకట్టపై వాకింగ్ చేస్తున్న స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి తన సిబ్బందితో ఆనకట్ట వద్దకు చేరుకొని మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం వైద్యశాలకు తరలించి అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. అయితే తన భార్య కనిపించడంలేదని వెంకటాద్రి బుధవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేసి ఉన్నాడు. మృతురాలి తండ్రి బాలయ్య తన కుమార్తె మృతిపై అనుమానాలు ఉన్నాయని ఫిర్యాదు చేశారన్నారు. ఈమేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

అప్పుల బాధతో యువకుడి బలవన్మరణం

నెల్లూరురూరల్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్య సమస్యలతో ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడినట్లు నెల్లూరు రూరల్ సీఐ గుంజి వేణు గురువారం తెలిపారు. ఆయన అందించిన సమాచారం మేరకు, దొంతాలికి చెందిన సూరిశెట్టి శ్రీనివాసులు (28), భార్యతో కలిసి కోడూరుపాడు వద్ద ఉన్న కల్తీకాలనీలో నివాసముంటున్నాడు. అప్పులు, అనారోగ్య సమస్యలు కారణంగా ఈనెల 25న ఇంటివద్ద గన్నేరుపప్పు తిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానికులు, కుటుంబ సభ్యులు అతడ్ని చికిత్స నిమిత్తం నెల్లూరులోని ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం అర్ధరాత్రి మరణించినట్లు సీఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన చెప్పారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

నెల్లూరు(వ్యవసాయం), ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): అనారోగ్యకారణంతో ఆత్మహత్యకు యత్నించి నెల్లూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ ఓ వృద్ధుడు గురువారం మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బుచ్చి మండలం దామరమడుగుకి చెందిన నడవల సుధాకర్(81) క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. బుధవారం చికిత్స నిమిత్తం గ్రామం నుంచి నెల్లూరు ఆత్మకూరు బస్టాండుకు చేరుకున్నాడు. అయితే జీవితంపై విరక్తి చెంది బస్టాండులోని బాత్‌రూం వద్ద పురుగుల మందు తాగి స్పృహ కోల్పోయారు. స్థానికులు చికిత్స నిమిత్తం నెల్లూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుదూ మృతిచెందాడు. ఈమేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నవాబుపేట పోలీసులు తెలిపారు.

● గుర్తుతెలియని వ్యక్తి...

నగరంలోని రామలింగాపురం సమీపంలో గురువారం గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. రామలింగాపురం రైల్వే అండర్ పాస్ సమీపంలోని వేంకటేశ్వరస్వామి గుడి వద్ద సుమారు 55 ఏళ్ల వ్యక్తి కూర్చుని మృతిచెంది ఉండడాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పరిశీలించిన బాలాజీనగర్ పోలీసులు మృతదేహాన్ని నెల్లూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి, కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అతిగా మద్యం తాగి మృతిచెంది ఉంటాడని భావిస్తున్నారు. వివరాలకు 9440796311 నెంబరును సంప్రదించాలని పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి..

సంగం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనసూయనగర్ గ్రామానికి చెందిన ఎ హరిబాబు (32) వైద్యశాలలో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందినట్లు ఎస్ఐ రాజేష్ తెలిపారు. వివరాల మేరకు.. గ్రామానికి చెందిన హరిబాబు మద్యానికి బానిసై అప్పుల పాలు అయ్యాడు. ఈక్రమంలో అప్పుల బాధలు తాళలేక ఈనెల 16వ తేదీన పురుగుల మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. గుర్తించిన కుటుంబ సభ్యులు నెల్లూరులోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఇదేంటండీ... మురుగునీరు ఇలా..?

ఇదేంటండీ... మురుగు నీళ్లు ఇలా పైకి వస్తున్నాయి.. మీరు చూడలేదా... ఈ ప్రాంతానికి రాలేదా...? అని ఎన్ఎంసీ కమిషనర్ సూర్యతేజ ఇంజనీరింగ్ అధికారులపై మండిపడ్డారు. సాధారణ పర్యటనలో భాగంగా ఆయన గురువారం బీవీనగర్ బ్యాంకు కాలనీలో వెళ్తుండగా ఓ రోడ్డులో మ్యాన్‌హోల్ ద్వారా మురుగునీళ్లు బయటకు పొంగడాన్ని గమనించారు. అక్కడే ఉండి ఇలా ఎందుకు జరుగుతుందని అధికారులను ప్రశ్నించారు. వెంటనే మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు.

- నెల్లూరు (సిటీ,ఆంధ్రజ్యోతి)


మ్యాన్‌హోల్ ద్వారా పైకి పొంగుతున్న మురుగునీటిని పరిశీలిస్తున్న కార్పొరేషన్ కమిషనర్

బయోమెట్రిక్‌లో బోగస్!

- సంక్షేమ హాస్టళ్లలో అధికారుల చేతివాటం
- విద్యార్థులు లేకపోయినా హాజరు
- 'ముఖహాజరు' విధానంలో వెలుగులోకి..
- ఆగస్టు, జనవరి నెలల్లో వ్యత్యాసాలు
- రూ.62.62 లక్షలు స్వాహా చేసినట్లు సమాచారం

నెల్లూరు (హరనాథపురం) ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థుల హాజరుపై అధికారుల చేతివాటం వెలుగులోకి వచ్చింది. హాస్టళ్లలో విద్యార్థులు లేకపోయినా హాజరు వేసి రూ.లక్షల్లో స్వాహా చేసినట్లు అధికారులు గుర్తించారు. హాస్టళ్లలో ముఖ హాజరు ప్రవేశపెట్టేందుకు ముందు బయోమెట్రిక్ విధానంలో బీసీ వసతి గృహ విద్యార్థులతో హాజరు వేయించే పద్ధతి ఉండేది. ఇందులో అనేక అక్రమాలు జరుగుతున్నట్లు ఫిర్యాదులు వచ్చాయి. ఈ వ్యవహారంపై ఇటు అధికారులు, అటు విజిలెన్స్ జరిపిన తనిఖీల్లోనూ ఇది బహిర్గతమైంది.

● సాంకేతిక పరిజ్ఞానం అమలులోకి..

బోగస్ హాజరును నివారిస్తే అక్రమాలకు చెక్ పడినట్లేనని ఆ దిశగా కూటమి ప్రభుత్వం చర్యలకు ఆదేశించింది. ఈ క్రమంలో బీసీ సంక్షేమ హాస్టళ్లలో నూతన సాంకేతిక విధానం అమలు చేస్తోంది. ఇప్పటివరకు ఉద్యోగులు, ఉపాధ్యాయులకు మాత్రమే అమలు చేసిన ముఖ హాజరు (ఫేషియల్ రికగ్నైజేషన్ సిస్టం)ను ఈ ఏడాది జనవరి నుంచి అమలులోకి తెచ్చింది. జిల్లాలో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పాఠశాల స్థాయి విద్యార్థులకు (3 నుంచి 10వ తరగతి వరకు) 65 ప్రీ మెట్రిక్ వసతి గృహాలు ఉండగా, ఇందులో 3093 మంది విద్యార్థులు ఉన్నారు. కళాశాల స్థాయి విద్యార్థులకు 16 పోస్టుమెట్రిక్ వసతి గృహాలు ఉండగా, 1059 మంది ఉన్నారు. ముఖ హాజరు ద్వారా తీసిన ఫొటోను ఏపీ నివాసి యాప్‌లో నమోదు చేస్తారు. అందులో విద్యార్థి చదువు, ఎక్కడ నివాసం ఉంటున్నాడు. తదితర వివరాలు నమోదు చేస్తున్నారు. ఈ విధానం ద్వారానే విద్యార్థుల మెస్ బిల్లుల అనుసంధానం ఉంటుంది. ప్రతి రోజు ఉదయం 9గంటల్లోపు హాజరు పూర్తి చేసి ఆ వివరాలను యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది.



బీసీ సంక్షేమ శాఖ కార్యాలయం

● అవినీతి ఇలా వెలుగులోకి..

జిల్లాలోని 65 బీసీ సంక్షేమ హాస్టళ్లలో బయోమెట్రిక్ విధానం ప్రకారం గత ఏడాది ఆగస్టులో 3,732 మంది విద్యార్థులు ఉన్నట్లు ఆ శాఖ రికార్డుల్లో నమోదై ఉంది. ఈ ఏడాది జనవరిలో 3093 మంది విద్యార్థులు మాత్రమే ముఖ హాజరులో ఉన్నట్లు తేలింది. ఆగస్టుకు, జనవరికి పోలిస్తే 639 మంది విద్యార్థులు తగ్గారు. అంటే హాస్టళ్లలో 639 మంది విద్యార్థులు లేకపోయినా ఉన్నట్లు చూపి సుమారు రూ.62.62 లక్షలు హాస్టల్ వెల్ఫేర్ అధికారులు స్వాహా చేసినట్లు సమాచారం. ప్రీమెట్రిక్ హాస్టల్లో ఒక్కో విద్యార్థికి నెలకు రూ.1400 చొప్పున ప్రభుత్వం ఖర్చు చేస్తోంది. ఈ లెక్కన రూ.62.62 లక్షలను కొందరు వార్డెన్లు స్వాహా చేసినట్లు సమాచారం. హాస్టల్‌కు రాని విద్యార్థుల విషయంలో డైట్ బిల్లుల క్లెయిమ్ చేసి స్వాహాకు పాల్పడినట్లు సమాచారం.

● రెండు హాస్టళ్లలో వెలుగులోకి..

విడవలూరు బీసీ బాలుర వసతి గృహంలో 74 సీట్లు ఉంటే అటెండెన్స్‌లో 77 మందిగా చూపించారు. వాస్తవానికి ఇక్కడ సగం మంది విద్యార్థులు కూడా లేరు. బిల్లులు మాత్రం 77 మందికి మంజూరయ్యాయి. అదేవిధంగా ఇందుకూరుపేట మండలం మైపాడు బీసీ బాలుర హాస్టల్లో విద్యార్థులే లేకపోయినా వారికి బిల్లులు, భవన అద్దెను పెట్టి బిల్లులను హెచ్‌డబ్ల్యూఓ మంజూరు చేయించుకున్నట్లు సమాచారం. ఈ రెండు వసతి గృహాల్లో రూ.లక్షల్లో ప్రభుత్వ సొమ్మును స్వాహా చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ హాస్టళ్ల హెచ్‌డబ్ల్యూఓల అవినీతి ఆరోపణలపై కలెక్టర్‌కు ఫిర్యాదులు వెళ్లాయి. దీంతో ఆయన మూడు నెలల కిందట జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అధికారి ద్వారా విచారణ చేయించారు. కాగా శాఖపరమైన విచారణ జరగడానికి సంబంధించిన నివేదికను బీసీ సంక్షేమ అధికారి కలెక్టర్‌కు పంపారు. కలెక్టర్ చర్యలు ఆదేశించడంతో జిల్లా బీసీ సంక్షేమ అధికారి వెంకటలక్ష్మి ఆ హాస్టళ్ల హెచ్‌డబ్ల్యూఓలకు గురువారం మెమో జారీ చేశారు.

మెమో జారీ చేశాం



విడవలూరు, మైపాడు బీసీ వసతి గృహాల్లో డైట్ బిల్లుకు సంబంధించి కలెక్టర్‌కు నివేదిక పంపాం. ఆయన ఆదేశాల మేరకు ఆయా వార్డెన్లకు గురువారం మెమోలు జారీ చేశాం. వారిచ్చే సమాధానం బట్టి చర్యలు తీసుకుంటాం. జిల్లాలో బయోమెట్రిక్ విధానం అమల్లో ఉన్నప్పుడు, వసతి గృహాలకు హాజరుకానీ విద్యార్థులకు సంబంధించి, హెచ్‌డబ్ల్యూఓలు, డైట్ బిల్లులు క్లైమ్ చేసి ఉంటే వారిపై చర్యలు తీసుకుంటాము. అక్రమాలకు ఎవరు పాల్పడినా చర్యలు తప్పవు.

- వెంకటలక్ష్మి, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి

న్యాయవాదులు విధుల బహిష్కరణ

నెల్లూరు (లీగల్), (ఆంధ్రజ్యోతి) : అడ్వకేట్స్ యాక్ట్‌లో కొత్తగా ప్రవేశపెట్టిన అమెండ్‌మెంట్స్‌కు వ్యతిరేకంగా గురువారం నెల్లూరు బార్ అసోసియేషన్ అధ్వర్యంలో న్యాయ వాదులు కోర్టు విధులను బహిష్కరించారు. దీంతో కోర్టుల్లో కార్యకలాపాలు స్తంభించాయి. శుక్రవారం కూడా న్యాయవాదులు కోర్టు విధులను బహిష్కరించనున్నారు.

మంత్రి నారాయణను ఆదర్శంగా తీసుకోండి

● టెన్త్ విద్యార్థులతో డీఈవో బాలాజీరావు


విద్యార్థులతో మాట్లాడుతున్న జిల్లా విద్యాశాఖాధికారి బాలాజీరావు

మనుబోలు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : పట్టుదలలో రాష్ట్ర మంత్రి పి.నారాయణను ఆదర్శంగా తీసుకోవాలని డీఈవో బాలాజీరావు టెన్త్ విద్యార్థులకు సూచించారు. గురువారం స్థానిక ఉన్నత పాఠశాలను తనిఖీ చేసిన ఆయన, పదో తరగతి గదిలోకి వెళ్లి తెలుగు పాఠ్యాంశంపై విద్యార్థులకు పలు ప్రశ్నలు సంధించారు. ఈ సందర్భంగా ఆయన డీఈవో మాట్లాడుతూ 'టెన్త్‌లో తాను ఫెయిల్ అయ్యానని, అప్పటి సీఎం 3 గ్రేస్ మార్కులు ఇవ్వడంతో పాస్ అయినట్లు' ఇటీవల ఓ సమావేశంలో నారాయణ స్వయంగా అన్నారని గుర్తు చేశారు. తరువాత చదువుపై పట్టుసాధించి ఎంఎస్‌లో యూనివర్సిటీ ఫస్ట్ వచ్చారన్నారు. తరువాతనే మిగతా విద్యార్థులు తనలా కాకూడదనే పలు విద్యాసంస్థలు స్థాపించారన్నారు. కావున పట్టుదలతో చదివి, మంచి మార్కులు సాధించాలని విద్యార్థులకు సూచించారు. ఇక జిల్లావ్యాప్తంగా 19 మండలాల్లో ఎంఈవోల కొరత ఉన్నట్లు చెప్పారు. అంతకముందు ఎమ్మార్సీ కార్యాలయంలో అధికారులు, ఉపాధ్యాయులతో ఆయన చర్చించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో-2 రమేష్, పాఠశాల హెచ్‌ఎం డేవిడ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేషనల్ యూత్ ఫెస్టివల్ గోడపత్రిక ఆవిష్కరణ


గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న వర్సిటీ వీసీ ప్రొఫెసర్ శ్రీనివాసరావు

వెంకటాచలం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక వీఎస్‌యూలో గురువారం నేషనల్ యూత్ ఫెస్టివల్- 2025 గోడ పత్రికలను వర్సిటీ వీసీ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాస్థాయిలో వికసిత్ భారత్ నేషనల్ యూత్ ఫెస్టివల్ నిర్వహించే బాధ్యతను వీఎస్‌యూలోని ఎన్ఎస్ఎస్ విభాగం, నెహ్రూ యువ కేంద్రానికి కేంద్ర ప్రభుత్వం అప్పగించిందన్నారు. దేశాభివృద్ధికి సంబంధించి యువత తమ ఆలోచనలు, ప్రణాళికలను పంచుకునేందుకు ఈ కార్యక్రమం ఒక మంచి వేదికగా మారుతుందన్నారు. విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కే సునీత, వర్సిటీ ప్రిన్సిపాల్ సీహెచ్ విజయ, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ అల్లం ఉదయ్‌శంకర్, డాక్టర్ ఎస్‌బీ సాయినాథ్, డాక్టర్ పీపీ సుబ్బారెడ్డి, డాక్టర్ నీలమణికంఠ తదితరులు పాల్గొన్నారు.

సిటీప్లానింగ్ సెక్రటరీలపై కమిషనర్ ఆగ్రహం

● ఇంజనీరింగ్ అధికారులపై కూడా మండిపాటు


వార్డు సచివాలయ ప్లానింగ్ సెక్రటరీలపై ఆగ్రహిస్తున్న కమిషనర్ సూర్యతేజ

నెల్లూరు(సిటీ), ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు నగరంలో అనుమతులు లేని, అక్రమ నిర్మాణాలు గుర్తించడంలో నిర్లక్ష్యం వహించిన వార్డు సచివాలయ సిటీ ప్లానింగ్ సెక్రటరీలపై కమిషనర్ సూర్యతేజ ఆగ్రహించారు. ఇలాగైతే చర్యలు తీసుకోవాల్సి వస్తుందని స్పష్టం చేశారు. సచివాలయాల వారీగా అక్రమ నిర్మాణాలు గుర్తించాలని సూచిస్తూ గురువారం ఆయన సచివాలయ ప్లానింగ్ సెక్రటరీలతో కార్పొరేషన్‌లో సమావేశం నిర్వహించారు. అత్యధికులు గైర్హాజరయ్యారు. దీంతో మండిపడ్డ కమిషనర్ సమావేశాలకు కూడా సమయానికి రారా..? అంటూ ప్రశ్నించారు. కాగా కొందరు ప్లానింగ్ సెక్రటరీలు అక్రమ నిర్మాణాలు గుర్తించడంతో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారంటూ వారిపై ఆయన మండిపడ్డారు. వారిపై చర్యలు తీసుకునేందుకు సిద్ధపడ్డారు. 23వ డివిజన్‌లో పర్యటించిన ఆయన అక్కడ సైతం ప్లానింగ్ సెక్రటరీలపై ఆగ్రహించారు.

● ఆంధ్రజ్యోతి కథనంపై స్పందన

కార్పొరేషన్‌లో ఇంజనీరింగ్ అధికారులు రోడ్లు, కల్వర్టులు, డ్రైన్ల నిర్మాణాల్లో నాణ్యతకు తిలోదకాలిచ్చి, కమీషన్లు దండుకుంటున్నారంటూ ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనంపై కమిషనర్ సూర్యతేజ స్పందించారు. కొందరు ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడిన ఆయన అవినీతికి పాల్పడితే, తాను ఊరుకునే ప్రసక్తేలేదని తేల్చి చెప్పారు. ఈ కథనంపై లోతైన అధ్యయనం కావాలని, శాఖాపరమైన విచారణకు ఆదేశించారు.

ఉచిత న్యాయ సేవలను వినియోగించుకోవాలి

● న్యాయసేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి వాణి


ఖైదీలతో మాట్లాడుతున్న న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి వాణి

వెంకటాచలం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ఉచిత న్యాయసేవలను ఖైదీలు వినియోగించుకోవాలని న్యాయసేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కే వాణి సూచించారు. మండలంలోని చెముడుగుంట సమీపంలో ఉన్న జిల్లా కేంద్ర కారాగారంలో గురువారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆమె విచ్చేసి ఖైదీల యోగక్షేమాలు, వారి కేసుల వివరాలు, భోజన వసతి, వైద్య సదుపాయాలు ఎలా ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. ఆమె మాట్లాడుతూ ప్రతిఒక్కరూ చట్టాలపైన అవగాహన కలిగి ఉండాలన్నారు. పేదలు న్యాయ సేవలు, సలహాలు పొందవచ్చన్నారు. ఏ అవసరం ఉన్నా లీగల్ కౌన్సిల్ సభ్యులను సంప్రదించాలని సూచించారు. అలాగే కేంద్రకారాగారంలో కూడా పేరా లీగల్ వాలంటరీలను నియమించడం జరిగిందన్నారు. అవసరమైతే వారి ద్వారా అర్జీల రూపంలో ఇవ్వవచ్చన్నారు. ఖైదీలు ఇక్కడి నుంచి వెళ్లిపోయిన తరువాత కుటుంబ సభ్యులతో సంతోషంగా ఉండాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు, జిల్లా లోక్ అదాలత్ సభ్యులు మాలకొండయ్య తదితరులు పాల్గొన్నారు.

వివాహిత బలవన్మరణం

● నాడు ప్రేమపెళ్లి సంచలనం
● నేడు విషాదాంతం

నెల్లూరు(క్రైం), (ఆంధ్రజ్యోతి): రెండేళ్ల కిందట జిల్లా వ్యాప్తంగా సంచలనం రేపిన ప్రేమ వివాహం నేడు విషాదంతో ముగిసింది. తల్లిదండ్రులను కాదని ప్రేమ వివాహం చేసుకున్న ఆ యువతి ఆత్మహత్య చేసుకుంది. ఓ బిడ్డకు జన్మనిచ్చి నెలలు గడవక ముందే గుడ్‌బాయ్.. అంటూ మెసేజ్ పెట్టి ఆత్మహత్య చేసుకుంది. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. పోలీసుల సమాచారం మేరకు, నెల్లూరు రూరల్ మండలం కాకుపల్లికి చెందిన శేషసాయి, పొదలకూరు మండలం మర్రిపల్లికి చెందిన శివప్రియ (26) రెండేళ్లకిందట ప్రేమవివాహం చేసుకున్నారు. అప్పట్లో ఆ ఆ వివాహం జిల్లా వ్యాప్తంగా పెద్ద చర్చనీయాంశంగా మారింది. తొలుత వారు కాకుపల్లిలో కాపురం పెట్టారు. మూడు నెలల కిందట వారు ప్రశాంతినగర్‌కి కాపురం మార్చారు. వారికి పదకొండు నెలల కుమారుడున్నాడు. కుమారుడి విషయంలో గురువారం దంపతుల మధ్య వాగ్వివాదం జరిగింది. శేషసాయి పని నిమిత్తం ఇంట్లో నుంచి బయటకు వెళ్లాడు. సాయంత్రం ఆమె తన భర్తకు వాట్సప్‌లో గుడ్‌బై .. అని మెసేజ్ చేసింది. ఇది చూసిన భర్త వెంటనే ఆమెకు ఫోన్ చేసినా లిఫ్ట్ చేయలేదు. దీంతో ఆయన ఇంటియజమానికి విషయాన్ని తెలియజేశాడు. వారు వెళ్లి కిటికీలోనుంచి చూడగా అప్పటికే శివప్రియ ఉరివేసుకుని ఉంది. దీంతో వారు విషయాన్ని భర్తకు తెలియజేశారు. అందరూ కలిసి ఇంటి తలుపులు పగులగొట్టి ఆమెను అపోలో వైద్యశాలకు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. ఈ మేరకు శేషసాయి నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇన్‌స్పెక్టర్ అన్వర్‌బాషా వైద్యశాలకు చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. విషయం తెలుసుకున్న మృతురాలి తల్లిదండ్రులు నెల్లూరుకి చేరుకున్నారు. 'ప్రేమ వివాహం చేసుకోవద్దని, అతను మంచివాడు కాదని తమ కుమార్తెను బతిమిలాడామని, భర్త వేధింపులతోనే తన కుమార్తె మృతి చెందినట్లు తల్లిదండ్రులు కుటుంబసభ్యుల వద్ద ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. శేషసాయి వైసీపీ విద్యార్థి విభాగం మాజీ నాయకుడు కాగా, వైసీపీ ఎమ్మెల్సీకి అనుచరుడిగా ఉన్నట్లు సమాచారం.


శివప్రియ, శేషసాయిల పెళ్లి ఫొటో (ఫైల్)

కబ్జా కోరల్లో గ్రామ కంఠం భూములు

సంగం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొరిమెర్లలో గ్రామ కంఠం భూములు కొందరు కబ్జా చేసినా పట్టించుకునే నాథుడే లేడని గ్రామస్థుల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గ్రామ జనాభా క్రమేణా పెరుగుతుండడంతో స్థలాలకు డిమాండ్ పెరిగింది. స్థలాల ధరలకు రెక్కలొచ్చాయి. గ్రామ కంఠం భూములను కబ్జా చేసినవారు ఇళ్ల స్థలాలుగా విక్రయిస్తున్నారు. దీంతో ఈ స్థలాల ధరలు అమాంతం పెరిగిపోయాయి. వీటిని విక్రయించి కబ్జాదారులు జేబులు నింపుకుంటున్నారు. పంచాయతీ అధికారులు చోద్యం చూస్తుండడంతో నిరుపేదలు తలదాచుకునేందుకు జానెడు స్థలం దొరకడం లేదు. కొరిమెర్ల గ్రామ పంచాయతీలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు ఉత్తరం వైపు గ్రామ కంఠం మిగులు భూములున్నాయి. ఈ భూములను గతంలో ఒక సామాజిక వర్గం వారు ఆక్రమించి నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. అప్పట్లో వీరందరికీ గ్రామంలోనే మరోచోట ఇళ్ల స్థలాలు ఇచ్చారు. కాగా, ఖాళీ చేయించిన గ్రామ కంఠం భూములు కొంతకాలం పంచాయతీ ఆధీనంలో ఉన్నాయి. ఆ తరువాత ఈ భూములను పరపతి కలిగిన కొందరు కబ్జా చేసి విక్రయించి జేబులు నింపుకుంటున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.


ఆక్రమిత భూమిలో వేసిన పశువుల షెడ్డు

● చేతులు మారుతున్న భూములు

డిమాండ్ పెరగడంతో గ్రామ కంఠం స్థలాలు ఒకరి నుంచి మరొకరికి చేతులు మారుతున్నాయి. పశువులు, జీవాలు మేపుకుని జీవించే బడుగులకు వాటి నివాసాలకు స్థలాలు లేకపోవడంతో కబ్జాదారుల నుంచి కొనుగోలు చేస్తున్నారు. వీటికి బాగా డిమాండ్ పెరిగింది. దీన్ని ఆసరాగా చేసుకుని కబ్జాదారులు ధరలు పెంచేశారు.

● పట్టించుకోని పంచాయతీ అధికారులు

గ్రామ కంఠం భూములు, స్థలాలు పంచాయతీ ఆధీనంలో ఉంటాయి. సర్వ హక్కులు పంచాయతీదే. అయి తే ఆక్రమణదారులంతా పలుకుబడి, రాజకీయ పరపతి కలిగినవారు కావడంతో పంచాయతీ అధికారులు చోద్యం చూస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. ఉన్నతాధికారు లు స్పందించి గ్రామ కంఠం మిగులు భూములను గ్రామంలోని నిరుపేదలకు పంపిణీ చేయాలని కోరుతున్నారు.

నేడు ఐటీఐలో ఉద్యోగ మేళా

నెల్లూరు(విద్య), (ఆంధ్రజ్యోతి): ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నగరం లోని వెంకటేశ్వరపురం ప్రభుత్వ బాలుర ఐటీఐ కళాశాలలో శుక్రవారం ఉద్యోగమేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ కే.శ్రీధర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రముఖ సంస్థలు, కంపెనీల ప్రతినిధులు హాజరై ఉద యం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఇంటర్వ్యూలు నిర్వహించి ఉద్యోగావకాశాలు కల్పిస్తారన్నారు. జిల్లాలోని నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	94
లేయర్ లైవ్	75
స్కిన్ చికెన్	174
స్కిన్‌లెస్	194
లేయర్	127

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.8199
వెండి కిలో ధర	రూ. 97,700
వెండి ఒక గ్రాము	రూ.100.70

రౌడీమూకల హల్‌చల్

● వెంకటేశ్వరపురం సెంటర్‌లో అలజడి ● రోడ్లపైనే అడ్డదిడ్డంగా వాహనాల పార్కింగ్
● ఇదేమని ప్రశ్నిస్తే దౌర్జన్యమే.. ● 24గంటలూ అందుబాటులో మద్యం

నెల్లూరు, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): రోడ్లపైనే వాహనాలు ఆపి బాతాఖానీ కొడతారు.. పక్కన పెట్టుకోవచ్చుకదా...అని ఎవరైనా అంటే.. ఇక మరో ఆలోచన కూడా ఉండదు.. దాడికి దిగడమే... రాంగ్‌రూట్‌లో ద్విచక్రవాహనాలపై హల్‌చల్ చేస్తారు. ఆ వేగానికి ఎవరైనా అడ్డొస్తే ఇక బూతులే బూతులు.. అంతేనా..? అక్కడ రాత్రిళ్లు నిత్యం రౌడీమూకలు రోడ్లపై వీరంగం సృష్టిస్తుంటారు. అయినా పట్టించుకునేవారే కరవయ్యారు. ఇది నగరంలోని వెంకటేశ్వరపురం సెంటర్ పరిస్థితి.

● నిఘా ఉందా ?

ఇరవైఏళ్ల క్రితం వెంకటేశ్వరపురం అంటే అందరికీ హడల్. అయితే అప్పట్లో రాజకీయ పార్టీ నాయకులు, కార్యకర్తల మధ్య గ్రూపు తగాదాలు ఉండేవి. అయితే ఇప్పుడు అవన్నీ మారిపోయాయి. మరో కొత్త వాతావరణం నెలకొంది. 15ఏళ్లు దాటిన పిల్లాడితో మాట్లాడాలన్నా ఆలోచించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. రోడ్లపైన గొడవలు పడడం హీరోయిజంగా మారింది. ముఖ్యంగా వెంకటేశ్వరపురంలోని ఓ బార్ అండ్ రెస్టారెంట్ ఎదురుగా ఎప్పుడూ గొడవలే. రోడ్లపైనే వాహనాలు నిలుపుతారు. వెనుక ఉన్నవారు గట్టిగా హారన్ కొట్టినా, రోడ్డు పక్కన వాహనాలు పెట్టాలని సూచించినా భౌతిక దాడులు తప్పవు. ఫ్యామిలీతో వెళ్లేవారిని కూడా విచక్షణ లేకుండా నోటికొచ్చినట్లు బూతుల తిడతారు. రోడ్లపైనే ఆటోలు నిలుపుతూ మద్యం సేవిస్తూ ప్రయాణికులను ఇబ్బందులకు గురిచేస్తారు. గతంలో పోలీసులు రౌడీలు, ఆకతాయిలపై నిఘా పెట్టడం, కొంతమందిని విచారించడంతో శాంతిభద్రతలు అదుపులో ఉండేవి. ప్రస్తుతం ఆ పరిస్థితి లేక పోవడంతో అశాంతి నెలకొంది.



బారు ఎదురుగా బ్యారికేడ్ల తొలగించి నిలిపిన ఆటోలు, ద్విచక్రవాహనాలు

● 24గంటలూ అందుబాటులో మద్యం

వెంకటేశ్వరపురం సెంటర్‌లో 24గంటలూ మద్యం అందుబాటులో ఉంటుంది. రాత్రిపూట సంచుల్లో మద్యం సీసాలు పెట్టుకుని వాహనాల్లో అమ్మకాలు సాగిస్తున్నారు. వేకువ జామున మూడుగంటలకే మద్యం దుకాణం తలుపులు తెరుచుకుంటాయి. పోలీసులు వస్తుంటారు... పోతుంటారు.... అంతేకాని తలుపులు మాత్రం మూసుకోవు. ఇటీవల రాత్రి మద్యం కొనుగోలు చేసేందుకు వచ్చిన అధికారపార్టీకి చెందిన ఓ వ్యక్తికి అధిక ధరకు మద్యం అమ్మడంపై గొడవ చేశాడు. దీంట మద్యం అమ్ముతున్న రౌడీగ్యాంగ్ అతడిపై దాడి కూడా చేసింది. దీంతో ఆగ్రహించిన ఆ వ్యక్తి మరుసటిరోజు రాత్రి తన గ్యాంగ్‌తో వచ్చి వారితో గొడవకు దిగారు. అయితే ఇంకోసారి అలా జరగదని చెప్పడంతో వివాదం సద్దుమణిగింది.



వేకువజామున నుంచే బారులో మద్యం అమ్మకాలు

● పార్కింగ్ కోసమే రోడ్డు

వెంకటేశ్వపురం సెంటర్‌లో రోడ్డు ఉన్నది తమ వాహనాలు నిలుపుకునేందుకు మాత్రమే అన్నట్లుగా ఉంది. వెంకటేశ్వరస్వామి ఆలయం దగ్గర ఓవైపు కార్లు, ఆటోలు నిలుపుతారు. మరోవైపు తోపుడు బండ్లపై పండ్ల వ్యాపారాలు సాగిస్తుంటారు. కొంచెం పెద్ద కారు వచ్చినా కూడా అక్కడ ట్రాఫిక్ జామ్. అయినా వాహనాలు తీస్తారా అంటే అదీ లేదు. ఇక మద్యం షాపు ఎదురుగా ఉన్న జంక్షన్ పరిస్థితి మరీదారుణం. వాహనాలు రాంగ్‌రూట్‌లో రాకుండా ఉండేందుకు గతంలో పోలీసులు బ్యారికేడ్లు ఏర్పాటు చేశారు. వన్‌వే ట్రాఫిక్ ఉండడంతో పెద్ద సమస్యలు ఉండేవి కాదు. అయితే కొంతమంది ఆ బారికేడ్లను తీసేయడంతో వాహనాలు రాంగ్‌రూట్‌లో జనార్దన్‌రెడ్డి కాలనీవైపు వస్తున్నాయి. నేపథ్యంలో వెంకటేశ్వరపురంలో శాంతిభద్రతలు పూర్తిగా లోపించాయని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రంజాన్ ఏర్పాట్లు చేయండి

నెల్లూరురూరల్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): నగరంలోని అన్నీ మసీదుల వద్ద రంజాన్ సందర్భంగా పారిశుధ్య ఏర్పాట్లు చేయాలని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఏడీసీ నందన్‌కు సూచించారు. గురువారం నగరంలోని తన కార్యాలయం నుంచి ఆయనతో ఫోన్లో మాట్లాడారు. మార్చి 2 నుంచి రంజాన్ మాసం ప్రారంభం అవుతున్నందున ప్రతీ మసీదు వద్ద విద్యుత్ దీపాలతో అలంకరణలు చేయాలన్నారు. అలాగే నిత్యం పారిశుధ్య మెరుగుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. వేకువ జామున నుంచి రాత్రి 11 గంటల వరకు ముస్లింలు నమాజ్ కోసం మసీదుల వద్ద ఉంటారని, వాళ్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని నగర డీఎస్పీ సింధు ప్రియకు ఫోన్లో సూచించారు.

పరీక్ష సామగ్రి పంపిణీ

నెల్లూరు (సాంస్కృతికం) ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని నవాబుపేట చిన్నబాలయ్యనగర్‌లోని హైస్కూల్, తడికలబజారు సెంటర్‌లోని ఆర్‌ఎస్‌ఆర్ హైస్కూళ్ల పదో తరగతి విద్యార్థులకు గురువారం నెల్లూరు డిస్ట్రిక్ డైరెక్ట్ టాక్స్ బార్ అసోసియేషన్ నిర్వాహకులు పరీక్ష సామగ్రిని పంపిణీ చేశారు. ఛైర్మన్ జీవీ.చలపతిరావు ప్రసంగిస్తూ తమ అసోసియేషన్ ద్వారా రూ.30వేల విలువైన పరీక్ష సామగ్రిని వితరణ చేశామన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు చార్టెడ్ అకౌంటెంట్ వీఎంవీ.సుబ్బారావు, సెక్రటరీ విజయకుమార్, ట్రెజరర్ ఏ.లీలామోహన్, పూర్వ అధ్యక్షుడు శేషయ్య, కొణిజేటి శ్రీనివాసులు, సంఘ సేవకులు పెనాక సుజాతరెడ్డి, ముఖ్య అతిధులుగా పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు జాస్మిన్, పీ .నాగేశ్వరమ్మ, టీ.లక్ష్మీనారాయణ, సతీష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని దగ్గుపాటి రాధాకృష్ణ పర్యవేక్షించారు.

అన్న ప్రసాద వితరణ

నెల్లూరు(విద్య), ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో శ్రీసత్యసాయి సేవాట్రస్ట్ నిర్వాహకులు గురువారం అన్న ప్రసాద వితరణ చేశారు. అసోసియేషన్ సభ్యుడు తెనాలి చంద్రమోహన్ తండ్రి శివరామయ్య వర్ధంతిని పురస్కరించుకుని ఆసుపత్రిలోని రోగులకు, వారి అటెండర్లకు అన్న ప్రసాదం అందచేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు చింతల అమరేంద్రరెడ్డి, కార్యదర్శి పొన్నం రవిచంద్ర, కోశాధికారి జీకే.గోపీనాథ్, సభ్యులు స్వర్ణ రమేష్ బాబు, డాక్టర్ ఎంఎస్.రెడ్డి, ఓబుల్‌రెడ్డి, ఖలీల్‌బేగ్, జయదేవ్, హుస్సేన్, సుబ్బరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన పెంచుకోండి

నెల్లూరు (వైద్యం), ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : క్యాన్సర్ వ్యాధిపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని రెడ్‌క్రాస్ పాలక మండలి ఛైర్మన్ వాకాటి విజయకుమార్‌రెడ్డి కోరారు. గురువారం నగరంలోని రెయిన్‌బో పాఠశాలలో క్యాన్సర్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ క్యాన్సర్‌పై ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటే వ్యాధి నుంచి బయట పడవచ్చని తెలియచేశారు. రెడ్‌క్రాస్ చీఫ్ మెడికల్ అధికారి డాక్టర్ లక్ష్మి మాట్లాడుతూ జంక్ ఫుడ్ ఎక్కువగా తీసుకున్న వారికి క్యాన్సర్ వచ్చే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ నాగేశ్వరరావు, సర్జికల్ అంకాలజిస్ట్ డాక్టర్ ముత్తు, జనరల్ మేనేజర్ భక్తవత్సలం, నర్సింగ్ సూపరింటెండెంట్ మృదుల తదితరులు పాల్గొన్నారు.

శివపార్వతుల ఊరేగింపు

నెల్లూరురూరల్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రిని పురష్కరించుకుని నెల్లూరురూరల్ మండలంలోని గ్రామాల్లో ఘనంగా వేడుకలు నిర్వహించారు. బుధవారం అర్ధరాత్రి ప్రారంభమైన శివపార్వతుల ఊరేగింపులు గురువారం మధ్యాహ్నం వరకు కొనసాగాయి. సౌత్‌మోపూరు, ఆమంచర్ల, పెద్దచెరుకూరు, కోడూరుపాడు, కాకుపల్లి తదితర గ్రామాల్లో జరిగిన ఊరేగింపులు ప్రజలను ఆకట్టుకున్నాయి. ఎక్కడా అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు భద్రతా ఏర్పాట్లు చేశారు.



సౌత్‌మోపూరులో ట్రాక్టర్‌పై ఊరేగుతున్న ఆదిదంపతులు

వైభవంగా రుద్రాభిషేకాలు

నెల్లూరు (సాంస్కృతికం) ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా నగరంలోని పొగతోట ఆదిశంకర ధ్యాన మందిరంలో గురువారం రుద్రాభిషేకాలు వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆదిశంకర మహిళా భక్త మండలి ఆధ్వర్యంలో సామూహిక లలితా సహస్ర నామ పారాయణాలు జరిగాయి. అనంతరం అన్నప్రసాద వితరణ జరిగింది. ఈ కార్యక్రమాల్లో చక్రాల ఆనందకుమార్, తంగిరాల వెంకటశ్రీకాంత్‌శర్మ, కంచర్ల భాస్కర్, ఉచ్చి భువనేశ్వరి ప్రసాద్, అంచనాల నాగేశ్వరరావు, సమయానందస్వామి, తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి అగ్నిగుండ ప్రవేశం

నగరంలోని బాలాజీనగర్ అద్దాల సాయిబాబా మందిరం ఆధ్వర్యంలో మార్చి 1,2 తేదీల్లో పాండురంగస్వామి ఆనంద అగ్నిగుండ ప్రవేశం నిర్వహించనున్నట్లు సాయిదర్బార్ ఛైర్మన్ మధుసాయి ఒక ప్రకటనలో తెలిపారు. 1వతేదీ ఉదయం 5గంటలకు సముద్రస్నానం, కంకణధారణ, ధ్వజారోహణ, గుండంలో అగ్నిప్రతిష్ఠ, పండరి భజన ప్రారంభం, ముత్తైదువ సాంగ్యం, జెండాలతో పండరి భజన, కోలాటాలు, శ్రీకృష్ణలీలలు ప్రదర్శనలు జరుగుతాయన్నారు. 2వతేదీ తెల్లవారుజామున ఉగ్రనరసింహస్వామి దండకం, అగ్నిగుండ ప్రవేశం పూర్ణాహుతి జరుగుతాయని తెలిపారు.

సేంద్రియ ఉత్పత్తులకు మంచి ధరలు

నెల్లూరురూరల్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి) : సేంద్రియ పద్ధతుల్లో పండించే పంటలకు మార్కెట్లో మంచి ధరలున్నాయని ఏపీ సేంద్రియ ఉత్పత్తుల ధ్రువీకరణ అధికారి ఆర్. వెంకట సునీల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని ఆమంచర్లలో ఇండిగ్యాప్ (ఇండియా గుడ్ అగ్రికల్చర్ ప్రాక్టీస్) పథకం కింద సేంద్రియ పద్ధతుల్లో సాగు చేస్తున్న పంటలను వ్యవసాయ అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం ఏడీఏ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏడీ శ్రీనివాసులు, ఏవో నాగమోహన్, ఇతర అధికారులు నీరజ, లీనా తదితరులు పాల్గొన్నారు.



పొలాల వద్ద రైతులతో మాట్లాడుతున్న అధికారులు

రాజీవ్‌నగర్ రోడ్డుపై కంచె ఏర్పాటు... తొలగింపు

నెల్లూరు (సాంస్కృతికం) ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని కొత్తూరు వద్ద ఉన్న రాజీవ్ నగర్‌కు రూ.కోటితో రోడ్డు వేయగా, ఆ రోడ్డును గురువారం ఉదయం ముళ్ల కంపతో ఓ వ్యక్తి మూసివేశాడు. తన స్థలం మీదుగా రోడ్డు వేశారని, పరిహారం ఇవ్వాలని పట్టుబట్టాడు. దీంతో రాజీవ్‌గాంధీ కాలనీ, వైఎస్‌ఆర్ నగర్, తదితర ప్రాంతాల వారి రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది. ఈ సంఘటనపై రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి గురువారం రాత్రి స్పందించారు. అధికారులు, కంచె వేసిన వ్యక్తితో ఆయన సంప్రదింపులు జరిపి ముళ్ల కంచెను యంత్రాలతో తొలగించారు.

ప్రకృతి సేద్యానికి పూర్వవైభవం వచ్చేనా!?

ఇందుకూరుపేట, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ ప్రభుత్వంలో నిర్లక్ష్యానికి గురైన ప్రకృతి సేద్యానికి ప్రస్తుత కూటమి ప్రభుత్వంలోనైనా పూర్వవైభవం వస్తుందా అని రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు. పురుగు మందులు లేకుండా తక్కువ ఖర్చుతో పంటలు సాగు చేయడమే ప్రకృతి వ్యవసాయం. గత కొన్నేళ్లుగా బాగా వినిపిస్తున్న ఈ రకం సేద్యానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెద్దపీట వేస్తున్నాయి. సేంద్రియ కూరగాయలు, ధాన్యం, ఉద్యాన పంటలైన అరటి, ఇలా సాగుచేసిన పంటల ఉత్పత్తుల విక్రయానికి ప్రత్యేకంగా దుకాణాలు కూడా వెలుస్తున్నాయి. ప్రకృతి వ్యవసాయం సాగు విధానంపై అవగాహన కల్పించడం కోసం ప్రభుత్వం సున్నా బడ్జెట్ సమాజ సేద్యం (జడ్‌బీఎస్‌ఎఫ్) పేరుతో ప్రాజెక్టును ఏర్పాటు చేసింది. కానీ 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చాక ఆంధ్రప్రదేశ్ ప్రకృతి వ్యవసాయ సంస్థ (ఏపీసీఎన్‌ఎఫ్)గా మార్చేశారు. ప్రస్తుతం జిల్లాలో 153 రైతు సేవా కేంద్రాల పరిధిలోని 168 గ్రామ పంచాయతీలో 38,775 ఎకరాలలో ప్రకృతి వ్యవసాయం సాగు చేస్తున్నారు. మారిన పరిస్థితులకు అనుగుణంగా వ్యవసాయంలో రసాయనాల వినియోగాన్ని తగ్గించి ప్రకృతి సేద్యాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మారిన జీవనశైలి వలన ఆరోగ్యం దెబ్బతింటుంది. ఈ పరిస్థితుల్లో ఆహారమే ఔషధంగా పనిచేయాల్సి ఉంటుంది. కావున ప్రకృతి వ్యవసాయం ద్వారా వచ్చిన ఉత్పత్తులే దీనికి ముఖ్య ప్రత్యామ్నాయం అని నిపుణులు, వైద్యులు అంటున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ప్రకృతి వ్యవసాయాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసింది. ప్రస్తుత ఎన్డీఏ కూటమి ప్రభుత్వమైన రాబోవు ఖరీఫ్ సీజన్‌లోనైనా ప్రకృతి సేద్యం చేసేలా రైతులకు అవగాహన కల్పించి ప్రోత్సహించాలని కోరుతున్నారు.

స్టేషనరీ పంపిణీ

నెల్లూరు(సిటీ), ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి) : నగరంలోని కార్పొరేషన్ జూనియర్ కళాశాల విద్యార్థులకు ఎన్‌ఎంసీ మేయర్ స్రవంతి గురువారం తన చాంబరులో స్టేషనరీ అందించారు. మార్చిలో ఇంటర్ పరీక్షలు ఉండటంతో వారందరికీ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సామగ్రిని అందించారు. ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదువుకున్న వారికి మంచి భవిష్యత్ ఉంటుందని ఆమె తెలిపారు. కార్పొరేషన్ జూనియర్ కళాశాలలో చదివిన ప్రతి విద్యార్థి ఉత్తమంగా రాణించాలని కోరరు.

సిరిగోల్డ్ ఆస్తులు కాపాడండి

నెల్లూరు(వ్యవసాయం), ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): సిరిగోల్డ్ ఆస్తులు కాపాడి బాధితులకు న్యాయం చేయాలని బీజేపీ నమామి గంగే రాష్ట్ర కన్వీనర్ మిడతల రమేష్ కోరారు. ఈవిషయమై గురువారం ఆయన సీఐడీ డీఎస్పీ కోటారెడ్డికి వినతిపత్రం అందించారు. అనంతరం మాట్లాడుతూ సిరిగోల్డ్ ఆస్తులు విక్రయించి బాధితులకు నగదు అందించడంలో జాప్యం కారణంగా అప్పుల బాధతో 9మంది ఆత్మహత్య చేసుకున్నారన్నారు. మరో ఐదుగురు అనారోగ్యంతో మంచంపట్టి చనిపోయారన్నారు. సిరిగోల్డ్ ఆస్తులు జిల్లాలో దాదాపు రూ.30కోట్ల మేర ఉన్నాయని, వాటిని త్వరితగతిన బాధితులకు పంపిణీ చేసి న్యాయం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు నరాల సుబ్బారెడ్డి, లక్ష్మణరావు, కళ్ల భాస్కర్‌లతోపాటు సిరిగోల్డ్ బాధితులు పాల్గొన్నారు.

కనుల పండువగా సుందరేశ్వరుడి కల్యాణం

నెల్లూరు (సాంస్కృతికం) ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని రాజరాజేశ్వరి ఆలయంలోని సుందరేశ్వరస్వామికి శివరాత్రి ఉత్సవాలు భాగంగా గురువారం రాత్రి వైభవంగా కల్యాణం జరిగింది. కార్యక్రమాన్ని ప్రధాన అర్చకులు రఘురామమూర్తి, వేద పండితులు, అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివార్లకు ముత్యాల తలంబ్రాలు పోశారు. ఉదయం మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, కుంభహో రతులు, రుద్రహోమం, వేద పారాయణం, నాదస్వర కచేరీలు జరిగాయి. అనంతరం స్వామివారికి గజవాహన సేవ జరిగింది. ఉభయకర్తలుగా ఆల్తూరి సులోచనమ్మ, ఆల్తూరు గిరీష్‌రెడ్డి, రాధిక దంపతులు వ్యవహరించారు. ఈ కార్యక్రమాలను ఆలయ ఏసీ కోవూరు జనార్దన్‌రెడ్డి, ఆలయ సిబ్బంది పర్యవేక్షించారు.

● నగరంలోని స్వర్ణలింగేశ్వరస్వామి ఆలయంలో గురువారం ఉదయం మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, రుద్రహోమాలు, విశేషపూజలు, పుష్పాలంకారం జరిగాయి. రాత్రి శివపార్వతుల కల్యాణం జరిగింది. ఉభయకర్తలుగా పూర్వ ఉపరాష్ట్రపతి సతీమణి ఉషమ్మ, స్వర్ణభారత్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ దీపావెంకట్ వ్యవహరించారు. కార్యక్రమంలో పీ.సురేంద్రరెడ్డి, జనార్దన్‌రాజు, విక్రమ సింహపురి గణేష్ ఉత్సవ సమితి, విక్రమ సింహపురి కార్తీక దీపోత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

● మూలాపేటలో అన్నపూర్ణ సమేత నీలకంఠేశ్వరస్వామి వారికి వైభవంగా కల్యాణం జరిగింది. భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



కల్యాణమూర్తులుగా మీనాక్షి సమేత సుందరేశ్వరస్వామి

● ఉస్మాన్‌సాహెబ్‌పేట అన్నపూర్ణా సమేత కాశీవిశ్వనాథస్వామి ఆలయంలో ఉదయం రుద్రాభిషేకాలు, రుద్రహోమం, పూలంగిసేవ జరిగాయి. రాత్రి స్వామివార్లకు కల్యాణం రిగింది. కార్యక్రమంలో ఆడిటర్ రఘు, పత్తి జయరామయ్య, కామేశ్వరరావు, నగర ప్రముఖులు పాల్గొన్నారు. కార్యక్రమాలను ఆలయ ఈవో జి.దర్గయ్య, అర్చకులు పర్యవేక్షించారు.

● నగరంలోని హరనాథపురంలో పార్వతి సమేత బ్రహ్మేశ్వరస్వామి ఆలయంలో గురువారం రాత్రి శివపార్వతుల కల్యాణం జరిగింది. ఉభయదాతలుగా నారాయణ విద్యా సంస్థల జీఎం వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి దంపతులు వ్యవహరించారు.

● శోధన్‌నగర్‌లోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో గురువారం విశేష అభిషేకాలు పూజలు జరిగాయి. కార్యక్రమాలను డాడీ యూత్ ఫౌండేషన్ ఆనందరావు పర్యవేక్షించారు.

న్యాయవాదులు విధుల బహిష్కరణ

కోవూరు, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అడ్వొకేట్ యాక్టుకు చేసిన సవరణలను నిరసిస్తూ స్థానిక కోర్టుల్లో గురువారం న్యాయవాదులు విధుల్ని బహిష్కరించారు. తమ హక్కులకు భంగం కల్గించే విధంగా సవరణలున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం న్యాయాధికారులకు వినతిపత్రాలు సమర్పించారు. దీంతో అన్ని కోర్టుల్లో కార్యకలాపాలు వాయిదా పడ్డాయి. విధుల బహిష్కరణ కార్యక్రమానికి కోవూరు బార్ అసోసియేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎండీ సలీమ్, పూండ్ల బాబు నాయకత్వం వహించారు.

దాడులు చేయించి..

మళ్లీ మాపైనే కేసులా!?

బుచ్చిరెడ్డిపాళెం ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): గత నెల రోజులుగా ఇప్పటికి 3 సార్లు చెల్లాయపాళెంలోకి సుపారీ గ్యాంగ్‌ను ఇళ్లమీదకు తీసుకొచ్చి మారణాయుధాలతో దాడి చేయించి మళ్లీ మేము దాడి చేశామని మాపైనే తప్పుడు కేసులు పెట్టారని టీడీపీ నాయకుడు తమ్మిరెడ్డి మల్లికార్జున పేర్కొన్నారు. గురువారం స్థానిక ప్రజలతో కలసి చెల్లాయపాళెంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తమకు తమ మరదలి మధ్య భూవివాదాన్ని ఎమ్మెల్యే సూచనల మేరకు సర్వే చేయించి ఇద్దరికి సమానంగా పంపిణీ చేశార న్నారు. అయినా తమ పొలంలో బాట కావాలంటూ గ్రామంలో మారణాయు ధాలతో దాడులు చేయించిందన్నారు. గ్రామంలో ఎప్పుడు ఏం జరుగుతుందని ప్రజలు భయాందోళనలో ఉన్నారని, పోలీసులు విచారించి గ్రామంలో ప్రజలు ప్రశాంతంగా ఉండేలా చూడాలని కోరారు.



కల్యాణ వేంకటేశ్వరుడికి హనుమంతు సేవ

● గ్రామోత్సవంలో భక్తులకు దర్శనం

బుచ్చిరెడ్డిపాళెం, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): బుచ్చిరెడ్డిపాళెం రామకృష్ణానగర్‌లోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం కల్యాణ వేంకటేశ్వరుడుకి హనుమంతు సేవ జరిగింది. అనంతరం గ్రామోత్సవంలో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం ఆలయంలో నిత్య పూర్ణాహుతి, మంగళశాసనం, తీర్థప్రసాద వితరణ జరిగింది. ఈ కార్యక్రమానికి సత్యవోలు బుజ్జమ్మ ఉభయదాతగా వ్యవహరించారు.



నందీశ్వరుడిపై రామలింగేశ్వరుడి దర్శనం

పొదలకూరు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పురాతన శివాలయంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని రాత్రి 12గంటల తర్వాత రామలింగేశ్వరుడు వృషభ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చాడు. అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. రైతు సంఘం నాయకులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. గురువారం సాయంత్రం గిన్నెభిక్ష ఉభయకర్తలుగా సీసీఆర్ ప్రసాద్, ఎ కృష్ణమూర్తి, ఎం రాజశేఖర్, పీబీఎస్‌వీ ప్రసాదరావు, బి గోపాలకృష్ణమాచార్యులు వ్యవహరించారు. శుక్రవారం ఉదయం శివాలయంలో శివపార్వతుల కల్యాణాన్ని ఆర్యవైశ్య సంఘం వారు నిర్వహిస్తారు.

నేత్రపర్వంగా ఆదిభిక్షువు గిన్నె భిక్ష

పొదలకూరు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి వేడుకల్లో భాగంగా పొదలకూరు పురాతన శివాలయంలో కొలువైన రామలింగేశ్వరస్వామి గిన్నెభిక్ష కార్యక్రమం గురువారం సాయంత్రం పట్టణ పురవీధుల్లో నేత్రపర్వంగా సాగింది. ఇళ్ల వద్దకు వచ్చిన స్వామివారికి భక్తులు కాయకర్పూరం సమర్పించి గిన్నె లో భిక్ష వేశారు. పురవీధులన్నీ శివనామ స్మరణతో మారు మోగాయి. పొదలకూరు మండలం బ్రాహ్మణ సంఘం ఆధ్వ ర్యంలో జరిగిన ఈకార్యక్రమంలో ఉభయకర్తలుగా పొదల కూరు మండల బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు శివకుమార్ శర్మ, స్వామి, సీసీ ఆర్ ప్రసాద్, ఎ.కృష్ణమూర్తి, ఎం రాజశే ఖర్, పీబీఎస్‌వీ ప్రసాదరావు, బి గోపాలకృష్ణమాచార్యులు వ్యవహరించారు.



మేలైన వ్యవసాయ పద్ధతులపై అవగాహన

ఇందుకూరుపేట, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని జగదేవిపేటలో పొలంబడి కార్యక్రమంలో భాగంగా గురువారం మేలైన వ్యవసాయ పద్ధతులపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో విత్తన ధ్రువీకరణ విభాగం శాస్త్రవేత్త పీ.సునీల్‌రెడ్డి పాల్గొని మాట్లాడుతూ వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు సూచించిన ఎరువులు, పురుగు మందులు వాడి, పురుగు మందుల అవశేషాలు లేని పంట దిగుబడులు సాధించడమే మేలైన వ్యవసాయ పద్ధతులని తెలిపారు. దీనిలో భాగంగా మండలంలో ఐదుగురు రైతులను ఎంపిక చేశామని తెలిపారు. ఈ 5మంది రైతులకు ఎరువులు, పురుగు మందులు తక్కువ మోతాదులో వినియోగించి నాణ్యమైన దిగుబడులు సాధించే విధంగా పొలంబడి కార్యక్రమంలో శిక్షణ ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఇందుకూరుపేట సహాయ వ్యవసాయ సంచాలకులు ఏ.రాజ్‌కుమార్, మండల వ్యవసాయ అధికారి డి.రఘునాథరెడ్డి, గ్రామ వ్యవసాయ సహాయకులు నరహరి, పెంచలయ్య, నరేష్, మాదయ్య, ఝాన్సీ, దీక్షిత, తదితరులు పాల్గొన్నారు.

పీఎంఏజేఏవై చెక్కుల పంపిణీ

నెల్లూరు (హరనాథపురం) ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : ప్రధానమంత్రి అనుసూచిత్ జాతి అభ్యుదయ యోజన (పీఎంఏజేఏవై) ద్వారా ఎంపికైన 16 మంది ఎస్సీ లబ్ధిదారులకు రూ.35లక్షల చెక్కులను కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి గురువారం తన నివాసంలో పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సామాజికంగా వెనుకబడ్డ ఎస్సీ మహిళలను ఆర్థికంగా ఆదుకునేందుకు కేంద్రంలోని కూటమి ప్రభుత్వ సహకారంతో, రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు చేపట్టిందన్నారు. బడుగు బలహీన వర్గాలకు అండగా నిలుస్తూ, చేతల ప్రభుత్వమని నిరూపిస్తున్నదన్నారు. స్వయం ఉపాధి కల్పించే ఉద్దేశంతో ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి, పెన్నా డెల్టా ఛైర్మన్ జెట్టి రాజగోపాల్‌రెడ్డి, టీడీపీ మండల నాయకులు ఇంతా మల్లారెడ్డి, బత్తుల హరికృష్ణ, ఎంవీ.శేషయ్య, రావెళ్ల వీరేంద్రనాయుడు, బెజవాడ వంశీకృష్ణారెడ్డి, ఆడపాల శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం

బుచ్చిలో జరుగుతున్న కల్యాణ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో పాల్గొనాలని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డిని గురువారం ఆలయ కమిటీ ఛైర్మన్, సభ్యులు ఆహ్వా నించారు. నగరంలోని మాగుంట లేఅవుట్‌లో ఉన్న నివాసంలో ఆమెను కలిసి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను అందించారు. ఈ కార్యక్రమంలో కమిటీ ఛైర్మన్ కేశవరావు, సభ్యులు కళ్యాణ్, బాలు, తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

● చెప్పిందే చేస్తున్నాం

బుచ్చిరెడ్డిపాళెం, (ఆంధ్రజ్యోతి): కోవూరు నియోజకవర్గాన్ని అవినీతి, వివాద రహితంగా చేస్తామని ఎన్నికలకు ముందు చెప్పిన విధంగానే చేస్తున్నామని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. గురువారం బుచ్చిరెడ్డిపాళెంలో నిర్వహించిన గ్రీన్ బుచ్చి కార్యక్రమంలో భాగంగా తేజ డెవలపర్స్ సహకారంతో 600 మొక్కలు నాటే కార్యక్రమంలో ఆమె పాల్గొని మొక్కలు నాటారు. వాటి నిర్వహణ కూడా వారే చూస్తారని తెలిపారు. ప్రజల ఏళ్ల నాటి కల కూరగాయల మార్కెట్ త్వరలోనే సిద్ధమవుతుందన్నారు. ఈ సందర్భంగా ఓ చిన్నారి చేసిన భరతనాట్యం అలరించింది. ఈ కార్యమంలో ఛైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, కమిషనర్ బాలకృష్ణ, కౌన్సిలర్లు, నాయకులు ఏటూరి శివరామకృష్ణారెడ్డి, హరికృష్ణ, ఎంవీ.శేషయ్య, మోర్ల మురళి, ఎస్‌కే. పర్వీన్, హరనాథ్, రామానాయుడు, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులకు ప్రాధాన్యమివ్వండి

● డీపీవో శ్రీధర్‌రెడ్డి




కార్యదర్శులతో సమీక్షిస్తున్న డీపీవో శ్రీధర్‌రెడ్డి

విడవలూరు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్య పనులకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా పంచాయతీ అధికారి శ్రీధర్‌రెడ్డి సూచించారు. స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి పన్నులు త్వరితగతిన వసూలు చేయాలన్నారు. చెత్తసంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలన్నారు. వేసవిలో ప్రజలకు తాగునీటి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో నగేష్‌కుమారి, ఈవోఆర్‌డి మస్తాన్‌ఖాన్ పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

మనుబోలు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని జాతీయ రహదారిపై పోర్టు క్రాస్‌రోడ్డు వద్ద గురువారం ఎస్‌ఐ శివ రాకేష్ తన సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ నిర్వహించారు. వాహనాలకు సంబంధించిన పత్రాలను పరిశీలించారు. హెల్మెట్ ధరించకపోతే జరిమానా తప్పదని హెచ్చరించారు.



పెద్ద రథంపై గంగా సమేత శ్రీకాళహస్తీశ్వరుడు. చిన్న రథంపై జ్ఞానప్రసూనాంబ అమ్మవారు. రథాలపై స్వామి, అమ్మవార్ల వైభవాన్ని దర్శించుకునేందుకు మాడవీధుల్లోకి చేరిన భక్తుల శివనామ స్మరణలు. మరోవైపు 'ఓం నమఃశివాయ, హరహర మహాదేవ శంభోశంకరా..' అంటూ పెద్ద రథం మోకులను పట్టి వందలాది మంది భక్తులు లాగడంతో స్వామివారు ముందుకు కదిలారు. ఆ వెనకే 'జై జై కాళి... జై భద్రకాళి' అంటూ అమ్మవారిని స్తుతిస్తూ రథాన్ని లాగారు. ఇలా, స్వామి రథాన్ని అనుసరిస్తూ అమ్మవారూ మరో తేరుపై ముందుకు కదిలారు. మహాశివ రాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం 11 గంటలకు శ్రీకాళహస్తిలోని చతుర్మాడ వీధుల్లో మొదలైన రథోత్సవం.. మధ్యాహ్నం 2.30 గంటల వరకు సాగింది. రథాలపై భక్తులు ఉప్పు, మిరియాలు చల్లి మొక్కులు తీర్చుకున్నారు. మరికొందరు కింద పడిన ఈ మిరియాలను ప్రసాదంగా తీసుకెళ్లారు. అలాగే, రథాలు ముందుకు కదిలేందుకు మాడవీధుల్లో ఇసుక చల్లారు. మరోవైపు రథాల్లోని ఉత్సవమూర్తులను దర్శించుకునేందుకు ఉదయం 9 గంటల నుంచే వచ్చిన భక్తులతో మాడవీధులు కిక్కిరిశాయి. ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, బీజేపీ నేత కోలా ఆనంద్, ఈవో బాపిరెడ్డి కొబ్బరికాయలు కొట్టి జెండా ఊపి రథోత్సవాన్ని ప్రారంభించారు. ప్రారంభించారు. ఈ రథాలను లాగేందుకు భక్తులు పోటీపడ్డారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు

ఉదయం 9 గంటలకు: అధికార నంది, కామధేనువు వాహనసేవ

రాత్రి 10 గంటలకు: శేష, యాళి వాహనసేవ

నేటి రాత్రి శివపార్వతుల కల్యాణం

శుక్రవారం రాత్రి శివపార్వతుల కల్యాణం నిర్వహించనున్నారు. రాత్రి 10 గంటల తరువాత గజ వాహనంపై శ్రీకాళహస్తీశ్వరుడు, సింహ వాహనంపై జ్ఞానప్రసూనాంబదేవి బయలుదేరి పెండ్లిమండపం వద్దకు వేంచేస్తారు. శనివారం వేకువజామున స్వామివారి కల్యాణం జరగనుంది. బాల్యవివాహాలు జరగకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు.ఈ కల్యాణానికి శుక్రవారం టీటీడీ ఆధ్వర్యంలో పట్టువస్త్రాలు సమర్పించనున్నారు.

పరమ పావనం.. లింగోద్భవ దర్శనం

మహాశివరాత్రిని పురస్కరించుకుని గురువారం వేకువజామున 4గంటలకు పరమశివుడికి శుద్ధి అభిషేకం నిర్వహించారు. ఆ తర్వాత లింగోద్భవ అభిషేకం చేశారు. ఈ అభిషేకం పూర్తయ్యాక ఉదయం 6 గంటల వరకు భక్తులను లింగోద్భవ దర్శనానికి అనుమతించారు. రద్దీని దృష్టిలో పెట్టుకుని మహాలఘు దర్శనం ఏర్పాటు చేశారు.

భక్త జన రథోత్సవం




- శ్రీకాళహస్తీశ్వర, జ్ఞానప్రసూనాంబ దర్శనం
- జనసంద్రమైన శ్రీకాళహస్తి

లాహిరి.. లాహిరి.. లాహిరిలో..

చుట్టూతా విద్యుద్దీప కాంతులు. బాణసంచా వెలుగులు. పుష్కరిణి చుట్టూ చేరిన భక్తజనం. అందంగా అలంకరించిన తెప్పలపై స్వామి, అమ్మవార్లు. ఇలా మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి శ్రీకాళహస్తిలోని నారద పుష్కరిణిలో తెప్పోత్సవం నిర్వహించారు. ఆలయంలోని అలంకార మండపంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు విశేషంగా అలంకరించి, చప్పరాలపై బాబుఅగ్రహారంలోని నారద పుష్కరిణి వద్దకు తీసుకొచ్చారు. ఓ తెప్పపై స్వామివారు, మరో తెప్పపై అమ్మవారు పుష్కరిణిలో ఐదు ప్రదక్షిణలు చేశారు. ప్రతి ప్రదక్షిణకు అర్చకులు ప్రత్యేక హారతులు సమర్పించి భక్తులకు చూపారు. భక్తులందరూ స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, ఈవో బాపిరెడ్డి, ఉభయదాతలు, ఆలయాధికారులు తదితరులు పాల్గొన్నారు. - శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి




నారద పుష్కరిణిలో తెప్పలపై విహరిస్తున్న శ్రీకాళహస్తీశ్వరుడు, జ్ఞానప్రసూనాంబ

ఎస్వీయూ దూరవిద్యకు యూజీసీ అనుమతి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ దూరవిద్యా విభాగానికి యూజీసీ అనుమతులు మంజూరు చేసింది. 2024-25 విద్యా సంవత్సరానికి దూరవిద్యా విభాగం వివిధ కోర్సులు నిర్వహించుకోవడానికి ఆమోదం లభించింది. యూజీసీ పరిధిలోని డిస్టెన్స్ ఎడ్యుకేషన్ బ్యూరో (డెబ్) 2022 నుంచీ అనుమతులు మంజూరు చేయలేదు. అనుమతులు ఇవ్వాలని యూనివర్సిటీ నుంచీ యూజీసీకి ప్రతిపాదన వెళ్లింది. దీంతో డెబ్ బృందం మూడు రోజుల పాటు దూరవిద్యా విభాగం పరిధిలోని ప్రమాణాలు, వసతులు, కోర్సులు వంటి పలు అంశాలను అధ్యయనం చేసింది. ఈ క్రమంలో ఎస్వీయూ దూరవిద్య పరిధిలో 17 కోర్సుల నిర్వహణకు అనుమతిచ్చింది. దీనిపై ఎస్వీయూ వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు హర్షం వ్యక్తం చేశారు. ఈ అనుమతుల వల్ల దూరవిద్యా కోర్సుల్లో ప్రవేశానికి కొత్త నోటిఫికేషన్ జారీ చేయనున్నట్లు తెలిపారు.

తెలుగు భాషోన్నతికి పటిష్ట ప్రణాళిక అవసరం

- అంతర్జాతీయ తెలుగు భాషా సమావేశాల్లో వక్తలు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): తెలుగు భాషోన్నతికి పటిష్ట ప్రణాళికను రూపొందించాల్సిన అవసరముందని పలువురు పేర్కొన్నారు. తెలుగు అధ్యయన శాఖ- ప్రాచ్య పరిశోధన సంస్థ- బెంగళూరులోని తెలుగు సంపద సంయుక్తంగా నిర్వహిస్తున్న మూడవ అంతర్జాతీయ తెలుగు భాషా సమావేశాలను గురువారం ఎస్వీయూ సెనేట్ హాల్లో వీసీ అప్పారావు ప్రారంభించారు. సినిమా, మీడియా రంగాల్లో తెలుగుదనం తగ్గి ఆంగ్లత్వం పెరిగిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రపంచ సాహిత్య ప్రమాణాలకు ఏ మాత్రం తీసిపోని రీతిలో తెలుగు రచనలు ఉన్నాయని మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రమణ్యం అన్నారు. ఉన్నవ లక్ష్మీనారాయణ మాలపల్లె నవల, గురజాడ అప్పారావు కన్యాశుల్కం నాటకం ఇందుకు నిదర్శనమన్నారు. తెలుగులో ఇప్పటికీ కథకు ఆదరణ ఉండటం వల్లే వారానికి వందకుపైగా పత్రికల్లో అచ్చవుతున్నాయని తెలిపారు. భాష పరిరక్షణ పట్ల అందరూ ఐక్యంగా ప్రయత్నం చేయాల్సిన అవసరం ఉందని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయ వీసీ ఆచార్య కృష్ణమూర్తి అన్నారు. బోధన, అధికారిక కార్యకలాపాల్లో తెలుగు ప్రాధాన్యం మరింతగా పెరగాలని హైదరాబాదులోని కేంద్రీయ విశ్వవిద్యాలయ ఆచార్యులు గారపాటి ఉమామహేశ్వర రావు ఆకాంక్షించారు. తెలుగు ప్రాంతానికి వెలుపల వివిధ కళారూపాలు, సంప్రదాయాలు, ఆచారాల రూపంలో తెలుగు భాష కనిపిస్తోందని తెలుగు భాషా పరిశోధకుడు స.వెం. రమేష్ అన్నారు. మిగతా రాష్ట్రాల్లో.. విదేశాల్లోనూ తెలుగు భాషను కాపాడుతున్నది సామాన్య ప్రజలేనని తెలిపారు. ధారణ శక్తి వల్ల ఎవరైనా చురుగ్గా ఆలోచిస్తారనీ, తెలుగు పద్యాలు ఇటువంటి ధారణకు తోడ్పడతాయని ఎస్వీయూ విశ్రాంతాచార్యుడు శలాక రఘునాథశర్మ పేర్కొన్నారు. మూడు సమాంతర సదస్సుల్లో వివిధ ప్రాంతాల ప్రతినిధులు పరిశోధనా పత్రాలను సమర్పించారు. సాహిత్య.కామ్ ఆధ్వర్యంలో రచయిత రాసాని పుస్తకాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో సదస్సు సంచాలకులు ఆచార్య ఆర్.రాజేశ్వరమ్మ, నిర్వహణ కార్యదర్శి ఆచార్య వీసీ వేంకటేశ్వర్లు, సలహాదారు డాక్టర్ రేమిళ్ళ మూర్తి, పలువురు తెలుగు భాషాభిమానులు పాల్గొన్నారు.



ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

ఆకట్టుకున్న చిత్ర కళా ప్రదర్శన

అన్నమయ్య భవన్‌లో 30 మంది చిత్రకారులు, 100 చిత్రాలను ప్రదర్శించారు. ఎన్.యుగేష్, పి.మోహన ప్రియ, ఆలూరు రమాదేవి, బత్తుల అర్చన రూపొందించిన చిత్రాలు ఈ ప్రదర్శనలో కొలువుతీరాయి.

నిమిషం ఆలస్యమైనా అనుమతిలేదు

- రేపటి నుంచి ఇంటర్ పరీక్షలు
- 86 కేంద్రాలు.. 62,761 మంది విద్యార్థులు
- సమస్యలుంటే 0877 2237200కు ఫోను చేయండి

తిరుపతి(విద్య), ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): 'నిమిషం ఆలస్యమైనా అనుమతి లేదు. ముందుగానే విద్యార్థులు పరీక్షా కేంద్రం వద్దకు చేరుకోవాలి' అని అధికారులు స్పష్టం చేస్తున్నారు. శనివారం నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో అధికారులు సమయ పాలన ముఖ్యమని చెబుతున్నారు. ప్రతి రోజూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరగనున్నాయి. జనరల్, ఒకేషనల్ కలుపుకొని 32,213 మంది ఇంటర్ ప్రథమ.. 30,548 మంది ద్వితీయ సంవత్సరం కలుపుకొని.. మొత్తం 62,761 మంది పరీక్షలకు హాజరుకానున్నారు. వీరికి 86 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రతి కేంద్రంలోనూ 16కు తక్కువ కాకుండా.. మొత్తం 1,376 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. వీటిని అమరావతిలో ఇంటర్ విద్యామండలి కార్యాలయంలోని కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేశారు. దీంతో రాజధానిలోని బోర్డు అధికారులూ జిల్లాలో పరీక్షలను పర్యవేక్షించే అవకాశం ఉంది. ఇక, సమస్యాత్మక కేంద్రాలైన పిచ్చాటూరు, నాగలాపురంలలో పోలీసు భద్రత, విద్యాశాఖ సిబ్బంది, సీసీ కెమెరాల ఏర్పాట్లను పటిష్ఠం చేశారు. అలాగే, పోలీసు, రెవెన్యూ, అధ్యాపకులు, డీఈసీ మెంబర్లతో నాలుగు ఫ్లయింగ్ స్క్వాడ్లతో పాటు 8 సిట్టింగ్ స్క్వాడ్లను ఏర్పాటు చేశారు. అన్ని కేంద్రాలవద్ద 144 సెక్షన్.. విద్యార్థుల రాకపోకలకు ఆర్టీసీ సౌకర్యం, నిరంతర విద్యుత్తు సరఫరా, వైద్య సహాయ బృందాలను అందుబాటులో ఉంచనున్నారు.

పటిష్ఠంగా ఏర్పాట్లు చేశాం



ప్రశాంతంగా, ఎటువంటి అవకతవకలు లేకుండా పరీక్షలను నిర్వహించేందుకు కలెక్టర్ పర్యవేక్షణలో చర్యలు తీసుకున్నాం. విద్యార్థులకు అవసరమైన రవాణా, వైద్య, విద్యుత్, తాగునీరు తదితర అన్ని ఏర్పాట్లు చేశాము. ఇప్పటికే జిల్లాకు చేరిన ప్రశ్నపత్రాలను 24 పోలీస్ స్టేషన్లలో భద్రపరిచాం. 245 మంది ప్రత్యేక ప్రతిభావంతులైన విద్యార్థులకు.. సహాయకులను అనుమతిచ్చాం. నిమిషం ఆలస్యమైనా పరీక్షా కేంద్రంలోకి అనుమతి ఉండదు. విద్యార్థులు ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలి. ప్రశాంతంగా పరీక్షలు రాయాలి. ఎవరైనా కాపీకి పాల్పడితే కఠిన చర్యలు తప్పవు.

- జీవీ ప్రభాకర్‌రెడ్డి, ఆర్ఐవో, తిరుపతి

కంట్రోల్ రూమ్ ఏర్పాటు: తిరుపతి అన్నమయ్య కూడలి సమీపంలోని ఆర్ఐవో కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. సమస్యలు,ఫిర్యాదులు, సమాచారం కోసం విద్యార్థులు, వారి తల్లిదండ్రులు 0877 2237200 నెంబరులో కంట్రోల్ రూమ్‌ను సంప్రదించవచ్చు.

హాజరు తక్కువకు అపరాధం లేదు : హాజరు శాతం తక్కువైన విద్యార్థుల నుంచి గత వైసీపీ ప్రభుత్వం అపరాధ రుసుం వసూలు చేసేది. హాల్‌టికెట్లను ఆన్‌లైన్ నుంచి డౌన్‌లోడ్ చేసుకునే సమయంలో తక్కువైన హాజరు శాతాన్నిబట్టి రూ.1000 నుంచి రూ. 1500 వసూలు చేసేవారు కూటమి అధికారంలోకి వచ్చాక విద్యార్థులకు అలాంటి ఆర్థిక భారం లేకుండా చేసింది. హాజరు తక్కువైనా పైసా చెల్లించకుండా ఆన్‌లైన్‌లో గాని, మన మిత్ర (వాట్సప్ గవర్నెన్స్) ద్వారాగాని విద్యార్థులు హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

పాఠశాల స్థాయి నుంచే విద్యార్థుల్లో పరిశోధనలపై ఆసక్తిని కలిగించి... పరిశోధనాత్మక జ్ఞానాన్ని పెంపొందించి... వారిని భావి శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వం జిల్లా స్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు ఇన్‌స్పైర్ అవార్డ్స్ - మనక్ ప్రదర్శనా పోటీలను నిర్వహిస్తోంది. తాజాగా మన జిల్లాలోని వివిధ పాఠశాలల నుంచి జాతీయ, అంతర్జాతీయ ప్రదర్శనలకు ఎంపికైన పరిశోధనా విశేషాలు...

- తిరుపతి (విద్య), ఆంధ్రజ్యోతి

మన బుల్లి శాస్త్రవేత్తలు



జపాన్‌ను మెప్పించిన బాయిల్డ్ ఎగ్ షెల్ పీలర్



ఉడికిన తర్వాత కోడిగుడ్డు పెంకును తొలగించేందుకు అవస్థలు పడుతుంటాం. దీనికో సులభ యంత్రం కనిపెట్టింది రేణిగుంట మండలం, గుత్తివారిపల్లె జడ్పీహెచ్ఎస్ విద్యార్థిని గొల్లపల్లి రేష్మ. గుండ్రంగా తిరుగుతున్న బౌల్‌లోకి ఉడికించిన గుడ్లు వేయగానే పెంకులు ఒకవైపునకు, కోడిగుడ్లు మరో వైపునకు చేరతాయి. పాఠశాలలో మధ్యాహ్న భోజనం వండేవారి పనిని ఇది తేలిక చేస్తుంది. హోటళ్లు, ఆస్పత్రుల్లో ఈ పరికరం చాలా ఉపయుక్తంగా ఉంటుంది. టీచర్ పి. మునిరెడ్డి మార్గదర్శకత్వంలో ఈ ప్రాజెక్టును రూపొందించారు. బాయిల్డ్ ఎగ్ షెల్ పీలర్ ప్రాజెక్ట్ జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని, అక్కడ కూడా ఉత్తమ ప్రాజెక్టులలో ఒకటిగా నిలిచింది. ఆ తర్వాత జపాన్‌లో జరిగిన అంతర్జాతీయ సైన్స్ ప్రాజెక్ట్ ఎగ్జిబిషన్‌లో ప్రదర్శితమైంది.

టెంకాయలు కొట్టే యంత్రం

టెంకాయలకు తేలికగా రంధ్రాలు వేయడం, ఎంతగట్టిగా ఉన్న సులభంగా పగులగొట్టడం.. ఈ పరికరం చేస్తుంది. రామచంద్రాపురం మండలం, కమ్మపల్లి జీహెచ్ఎస్ విద్యార్థిని ఎం. వాణి రూపొందించిన యంత్రం ఇది. టీచర్ ఎస్‌జే కామేశ్వరి సహకారంతో ఈ ప్రాజెక్టును తయారు చేశారు.



చెత్త శుభ్రతకు యంత్రం

కొలువల్లోని చెత్తాచెదారాలను సులభంగా శుభ్రం చేసేందుకు తయారు చేసిన యంత్రం ఇది. నగరాల్లో డ్రైనేజీ కాలువలు శుభ్రంచేసే పనివారికి చాలా ఉపయోగపడుతుంది. తక్కువ సమయంలో ఎక్కువ పనిని చేసేందుకు దోహద పడుతుంది. దొరవారిసత్రం మండలం, కల్లూరు జడ్పీహెచ్ఎస్ విద్యార్థిని వి. నిరూష దీనిని రూపొందించారు. ఇది జాతీయస్థాయి ప్రదర్శనలో ప్రశంసలు అందుకుంది. టీచర్ పీవీ రమణయ్య మార్గదర్శకత్వంలో ఈ ప్రాజెక్టును రూపొందించారు.



కార్పొరేట్‌కు దీటుగా గురుకులాలు



విద్యార్థులకు విద్యాసామగ్రి అందజేస్తున్న డీసీవో గీత

నాయుడుపేట, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా గురుకులాల్లో విద్యాబోధన జరుగుతోందని చిత్తూరు, తిరుపతి జిల్లాల గురుకులాల డీసీవో ఎస్తేరు గీత అన్నారు. నాయుడుపేట ఎల్‌ఏ సాగరంలోని బాలుర గురుకులంలోని పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులకు టీడీపీ నాయకుడు ఆమవరపు సత్యం అందజేసిన ఎగ్జామ్ ప్యాడ్‌లు, విద్యాసామగ్రిని శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డీసీవో మాట్లాడుతూ గురుకులాల్లో అనుభవం కలిగిన ఉపాధ్యాయులు, అధ్యాపకులతో పాటు అన్ని మౌలిక సదుపాయాలు ఉన్నాయన్నారు. అలాగే విద్యార్థులకు నాణ్యమైన ఆహారంతో పాటు పౌష్టికాహాన్ని అందజేస్తున్నామని తెలిపారు. గురుకులాల్లో విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని చెప్పారు. కార్యక్రమంలో గురుకులం ప్రిన్సిపాల్ డాక్టర్ దాదాపీర్, వైస్ ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు, బందిల శేఖర్‌బాబు, మోహనరాజు, వెంకటరమణయ్య, రాజశేఖర్, భాస్కర్, కాటయ్య, సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కమనీయం... నీలకంఠేశ్వరుడి కల్యాణం



నీలకంఠేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

నాయుడుపేట టౌన్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని స్వర్ణముఖి నది తీరాన వెలసిన ప్రసూన్నాంబ సమేత నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. మహాశివరాత్రి మహోత్సవాల్లో భాగంగా గురువారం ప్రసూన్నాంబ సమేత నీలకంఠేశ్వరస్వామిని ప్రత్యేక పుష్పాలతో అలంకరించి వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలుగా ఆలయ చైర్మన్ గూడూరు సుధీర్‌రెడ్డి దంపతులు వ్యవహరించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. కార్యక్రమంలో గురుస్వామి బాలాజీ, కమిటీ సభ్యులు ఉగ్గుముడి భాస్కర్‌రెడ్డి, అంకయ్య, రాధకృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ మార్కెట్లు, దుకాణాల వేలం



మార్కెట్, దుకాణాల వేలం నిర్వహిస్తున్న కమిషనర్ ఫజులుల్లా

నాయుడుపేట, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట మున్సిపాలిటీ పరిధిలోని కూరగాయలు, మత్స్య, మాంస మార్కెట్లు, దుకాణాలకు గురువారం కమిషనర్ ఫజులుల్లా ఆధ్వర్యంలో వేలం పాటలు నిర్వహించారు. కూరగాయల మార్కెట్‌ను అబ్దుల్‌హమీద్ రూ.12.30 లక్షలకు దక్కించుకున్నారు. సీకేఎం షాపింగ్ కాంప్లెక్స్‌లో షాపు నెంబరు 2ను సుమన్‌కుమార్ రూ.9472కు, షాపునెంబరు 3ను ఎం.నిర్మల రూ.8290కు షాపునెంబరు 8ను సురేష్‌బాబు రూ.8950కు దక్కించుకున్నారు. మత్స్య, మాంస మార్కెట్ గతంలో రూ.8.5 లక్షలు రాగా, ఈసారి ఆ ధర చెల్లించడానికి ఎవరూ ముందుకు రాలేదు. దీంతో రూ.4.72 లక్షల నుంచి వేలం ప్రారంభించగా రూ.4.75 లక్షలకు అమీర్‌బాషా దక్కించుకున్నారు.

వైభవంగా కాశీవిశ్వేశ్వరస్వామి కల్యాణం



అన్నపూర్ణ, కాశీవిశ్వేశ్వరస్వామి కల్యాణం జరిపిస్తున్న వేదపండితులు

నాయుడుపేట, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట పాత బ్రాహ్మణ వీధిలోని అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. మంగళవాయిద్యాలు, వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ స్వామి, అమ్మవారి కల్యాణాన్ని జరిపించారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాదాలు అందజేశారు. ఉభయకర్తలుగా ఆలయ మాజీ చైర్మన్ కరీమ్‌బాయి, హరి దంపతులు, లోకనాధం దంపతులు వ్యవహరించారు.

అక్రిడిటేషన్ గడువు పెంపు

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుల అక్రిడిటేషన్ గడువును మరో మూడు నెలలు పొడిగిస్తున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 1నుంచి మే 31వ తేదీ వరకు పొడిగిస్తున్నామని, సంబంధిత మీడియా సంస్థల యాజమాన్యాలు వారి వద్ద పనిచేస్తున్న జర్నలిస్టుల వివరాలను తిరుపతి జిల్లా సమాచార పౌర సంబంధాలశాఖ కార్యాలయంలో వీలైనంత త్వరగా అందజేయాలని కోరారు.

రీ సర్వే తప్పులను సరిచేయండి

పెళ్లకూరు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని జీలపాటూరులో గతంలో జరిగిన రీ సర్వేకు సంబంధించిన రికార్డులు తప్పులతడకల ఉన్నాయని, వాటిని సరిచేయాలని రైతులు గురువారం తహసీల్దార్ ద్వారకనాథరెడ్డికి వినతిపత్రం అందజేశారు. 30 ఏళ్లకు మునుపు ప్రభుత్వం నుంచి పొంది ఫ్రీహోల్డ్‌కు అర్హత సాధించిన భూములు కలెక్టర్ ప్రొసెడింగ్‌లో ఉన్నప్పటికీ ఆన్‌లైన్‌లో వివరాలు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పలువురు భూములకు సంబంధించిన సర్వే నంబర్లు గల్లంతవడంతో పాటు ఒకరికి సంబంధించిన ఎల్‌పీఎం నంబర్లు మరొకరి పేరున ఉన్నామని చెప్పారు. రికార్డులను పరిశీలించి సమస్యలను పరిష్కరిస్తామని తహసీల్దార్ హామీ ఇచ్చారు.

ప్రయాణికుల నిరీక్షణకు నీడ కరువు

శిథిలావస్థలో బస్ షెల్టర్

కోట, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్‌లో ప్రయాణికుల నిరీక్షణకు నీడ కరువైంది. విద్యానగర్ నుంచి నాయుడుపేట, తిరుపతి, గూడూరు, నెల్లూరు పట్టణాలకు ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. అంతేకాకుండా ఈ ప్రాంతంలో ఉన్న విద్యాసంస్థల్లో చదువుకునేందుకు రోజూ వందలాది మంది విద్యార్థులు వచ్చి వెళుతుంటారు. ఎన్‌బీకేఆర్ విద్యాసంస్థల సౌజన్యంతో మూడు దశబ్దాల క్రితం ఏర్పాటు చేసిన బస్ షెల్టర్ శిథిలావస్థకు చేరుకుంది. దీంతో ప్రయాణికులు వేచి ఉండేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఎండ, వానతో నానా అవస్థలు పడాల్సి వస్తోందని విద్యార్థులు, ప్రయాణికులు వాపోతున్నారు. ఆర్టీసీ అధికారులు స్పందించి విద్యానగర్‌లో బస్ షెల్టర్ నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.



విద్యానగర్‌లో శిథిలావస్థలో ఉన్న బస్ షెల్టర్

మున్సిపాలిటీల అభివృద్ధికి పన్ను వసూళ్లే కీలకం

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ అభివృద్ధి చెందాలంటే పన్ను వసూళ్లే కీలకమని మున్సిపల్ శాఖ రీజినల్ డైరెక్టర్ సూర్యదేవర హరికృష్ణ అన్నారు. గురువారం ఆయన సూళ్లూరుపేట మున్సిపాలిటీలో అధికారులు, సిబ్బందితో విడివిడిగా సమావేశం నిర్వహించారు. ఇంటి పన్నులు, దుకాణాలకు సంబంధించిన బకాయిలను పూర్తిస్థాయిలో ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీ అభివృద్ధి చెందాలంటే పన్ను వసూళ్లే కీలకమన్న విషయాన్ని సిబ్బంది గుర్తించుకోవాలన్నారు. అనంతరం కార్యాలయలో రికార్డులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ చిన్నయ్య, మేనేజర్ శ్రీనివాసులు, టీపీవో బాలసుబ్రహ్మణ్యం, ఆర్ఐ రమేష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నాయుడుపేట: పట్టణాలు అభివృద్ధి చెందాలంటే ప్రభుత్వం అందించే నిధులతో పాటు వంద శాతం పన్నుల వసూళ్లు చేయాలని మున్సిపల్ శాఖ రీజినల్ డైరెక్టర్ సూర్యదేవర హరికృష్ణ అన్నారు. నాయుడుపేట మున్సిపల్ కార్యాలయంలో అధికారులు, సచివాలయ సిబ్బంది సమావేశంలో ఆయన మాట్లాడారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో 50శాతం కన్నా తక్కువగా పన్నులు వసూలు చేసిన



నాయుడుపేట మున్సిపల్ కార్యాలయంలో అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీఎం హరికృష్ణ

మున్సిపల్, సచివాలయ సిబ్బందికి షోకాజ్ నోటీసులు ఇస్తామన్నారు. మున్సిపాలిటీలో రూ.6 కోట్ల పన్నుల డిమాండు ఉండగా ఇప్పటివరకు రూ.3.5 కోట్లు మాత్రమే వసూలయ్యాయని అసంతృప్తి వ్యక్తం చేశారు. గడువులోగా వంద శాతం వసూలు చేయాలని ఆదేశించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనరు ఫజులుల్లా పాల్గొన్నారు.

6 వరకు అన్నమేడులో కంటి వైద్య ఉచిత శిబిరం

నాయుడుపేట టౌన్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట మండలం అన్నమేడులో గురువారం నుంచి మార్చి 6వ తేదీ వరకు చెన్నైలోని శంకర నేత్రాలయ ఆధ్వర్యంలో కంటి వైద్య ఉచిత శిబిరం నిర్వహిస్తున్నట్లు ఐ క్యాంప్ కోఆర్డినేటర్ చిగురువాడ పద్మనాభం తెలిపారు. అమెరికాలోని కాటంరెడ్డి ప్రసాద్‌రెడ్డి, శోభారెడ్డి దంపతుల సహకారంతో నిర్వహిస్తున్నట్లు ఈ వైద్య శిబిరంలో ఉచితంగా కంటి పరీక్షలతో పాటు శస్త్ర చికిత్స చేయనున్నట్లు తెలిపారు. రోగులతో పాటు వారి సహాయకులకు ఉచిత రవాణా, భోజన సదుపాయాలను కల్పిస్తామని, ప్రజలు ఈ అకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వ్యాన్ ఢీకొనడంతో నదిలో పడిన ఆటో



స్వర్ణముఖి నదిలో ఆటో

నాయుడుపేట టౌన్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): వ్యాను ఢీకొనడంతో ఆటో సర్వముఖినదిలో పడింది. నాయుడుపేట నుంచి మేనకూరు వెళ్లే దారిలో సర్వముఖినది బ్రిడ్జి వద్ద గురువారం ఈ ఘటన చోటు చేసుకుంది. ప్రయాణికులతో మేనకూరు వైపు వెళుతున్న ఆటోను వెనుక వైపు నుంచి వ్యాను ఢీకొంది. దీంతో అదుపుతప్పిన ఆటో బ్రిడ్జిపై నుంచి స్వర్ణముఖి నదిలో పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ రవి వర్మతో పాటు ప్రయాణికులు సందీప్, వరప్రసాద్‌కు స్వల్ప గాయాలయ్యాయి. గాయపడిన వారిని నాయుడుపేటలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

30 పడకల ఆస్పత్రి ప్రారంభం



ఆస్పత్రిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్, టీడీపీ నాయకులు

వాకాడు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో 30 పడకల ప్రభుత్వాస్పత్రిని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.5.10 కోట్లతో గూడూరు నియోజకవర్గంలోనే అత్యాధునికంగా ఎక్స్ రే, ల్యాబ్ తదితర గదులను కలిగిన ఆస్పత్రి వాకాడులో ప్రజలకు అందుబాటులోకి తేవడం ఆనందంగా ఉందన్నారు. అంతకుముంతు టీడీపీ నాయకులు దువ్వూరు మధుసూధన్‌రెడ్డి, విజయశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సునీల్‌కుమార్‌కు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో పాపారెడ్డి పురుషోత్తంరెడ్డి, దశరెడ్డి, తహసీల్దార్ రామయ్య, ఎంపీడీవో శ్రీనివాసులు, దోసకాయల కృష్ణమూర్తి, దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా దుస్తుల అందజేత



గూడూరు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో విస్తృతంగా సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని క్లబ్ జిల్లా గవర్నర్ గౌతమ్ అన్నారు. గురువారం స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో పలు క్రీడా పోటీల్లో ప్రతిభ చాటుతున్న విద్యార్థులకు క్రీడా దుస్తులను అందజేశారు. పాఠశాలలో మొక్కలు నాటారు. అనంతరం చవటపాళెంలోని ఆంజనేయస్వామి దేవస్థానంలో భక్తులకు సౌకర్యవంతంగా ఉండేలా సిమెంటు బెంచీలను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో రియాజ్ అహ్మద్, శివయ్య, మురళీరెడ్డి, రామ్మోహన్, శీనయ్య, రూపేష్, రవిచంద్ర, కల్యాణ్‌సాయి, రామ్మూర్తి, కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో అన్నదానం

వెంకటగిరి టౌన్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి వేడుకలను పురస్కరించుకుని పట్టణంలోని రామలింగేశ్వరస్వామి ఆలయం, వల్లివేడు క్రాస్‌రోడ్డులో ఉన్న భ్రమరాంబ సమేత మల్లిఖార్జునస్వామి ఆలయం, బంగారుపేటలో ఉన్న భవానీ శంకరాలయంలో అన్నదానం జరిగింది.

కోట: పట్టణంలోని వైష్ణాలయంలో గురువారం శివసేవ సంఘం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం జరిగింది. అలాగే కోట, విద్యానగర్ ప్రాంతాలకు చెందిన భక్తులకు శివసేవ సంఘం ప్రతినిధులు శివ, పార్వతుల కల్యాణ తలంబ్రాలను పంపిణీ చేశారు.

వృద్ధాశ్రమంలో...

గూడూరు అర్బన్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక సాయిరాం చారిటీస్ వృద్ధాశ్రమంలో గురువారం ప్రగతి సేవాసంస్థ ఆధ్వర్యంలో పేపళ్ల అమరయ్య నాయుడు దాతృత్వంతో వృద్ధులకు అన్నదానం చేశారు. కడివేటి చంద్రశేఖర్, శ్రీనివాసులు, రాము పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

కోట, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): కోట క్రాస్‌రోడ్డులో నివాసం ఉంటున్న నిర్మల (60) గురువారం నెల్లూరులో చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ నెల 14న నిర్మల ఇంటివద్ద తులసిమొక్కకు ప్రదర్శన చేస్తుండగా ప్రమాదవశాత్తు చీరకు నిప్పంటుకొని తీవ్రంగా గాయపడింది. ఆమెను నెల్లూరులోని ఓ ప్రైవేట్ వైద్యశాలలో చేర్పించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపారు.

పింఛను పంపిణీకి నూతన మార్గదర్శకాలు

తడ, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): సామాజిక పింఛన్ల పంపిణీకి ఉన్నతాధికారులు నూతన మార్గదర్శకాలు జారీ చేశారని ఎంపీడీవో విజయ్ కుమార్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ మార్చి ఒకటో తేదీ పంపిణీ చేసే పింఛన్లను ఉదయం 7 గంటల నుంచి అధికారులు ప్రారంభిస్తారన్నారు. లబ్ధిదారుడు ఇంటి నుంచి 300 మీటర్ల దూరం లోపు ఉన్నా పింఛను అందజేస్తామని చెప్పారు. తడ మండలంలో మొత్తం 5890 మందికి రూ.2.51 కోట్ల పింఛను సొమ్మును ప్రభుత్వం విడుదల చేసిందన్నారు.

చిల్లకూరులో తెలంగాణ మంత్రి తుమ్మల



మంత్రి తుమ్మలతో ఎమ్మెల్యే పాశిం, టీడీపీ నేత నానాజీ

చిల్లకూరు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): చిల్లకూరుకు చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు తానంకి నానాజీ నివాసానికి తెలంగాణ రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గురువారం విచ్చేశారు. ఆయనను ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ మర్యాద పూర్వంగా కలిశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు జానకి రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోండి

దక్కిలి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరిస్తే ప్రమాదాల సమయంలో ప్రాణాపాయం నుంచి బయటపడొచ్చని ఎస్ఐ శివశంకర్ గౌడ్ అన్నారు. గురువారం మండలంలోని దేవునివెల్లంపల్లి మార్గంలో వాహనాల తనిఖీ చేపట్టారు. హెల్మెట్ లేని వాహనదారులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. వాహనం నడిపేవారితో పాటు వెనకాల కూర్చొని ప్రయాణించే వారు కూడా హెల్మె ధరించాలని సూచించారు.

వీరబ్రహ్మేంద్రస్వామి గ్రామోత్సవం

గూడూరు, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెన్నూరులో మహాశివరాత్రిని పురస్కరించుకుని బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయం వరకు వీరబ్రహ్మేంద్రస్వామి, గోవింద మాంబ గ్రామోత్సవం నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో అన్నదానం చేశారు.

మసీదుల అభివృద్ధికి కృషి చేయండి

గూడూరు అర్బన్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ పరిధిలోని మసీదుల అభివృద్ధి కృషి చేయాలని మహ్మదీయన్ వెల్ఫేర్ నెట్‌వర్క్ గౌరవాధ్యక్షుడు రియాజ్ అహ్మద్ అన్నారు. గురువారం స్థానిక మహ్మదీయన్ వెల్ఫేర్ నెట్‌వర్క్ కార్యాలయంలో నియోజకవర్గ మసీదుల ముతవల్లి కమిటీ అధ్యక్షుడుగా ఎన్నికైన అబ్దుల్ రహీంను సన్మానించారు. కార్యక్రమంలో మెహబూబ్‌బాషా, షానవాజ్, కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్ మృతి

గూడూరు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఆదిశంకర కళాశాల సమీపంలో జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తమిళ నాడు రాష్ట్రం ఊత్తుకోటకు చెందిన వెంకటేష్(45) మృతి చెందాడు. స్థానికుల కథనం మేరకు... ఊత్తుకోటకు చెందిన వెంకటేష్ టాటా ఏస్ వాహనం డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం నెల్లూరు నుంచి నాయుడుపేట వెళ్తుండగా గూడూరు సమీపంలోని ఆదిశంకర కళాశాల సమీపంలో రోడ్డు పక్కన ఆగిఉన్న లారీని అదుపుతప్పి ఢీకొంది. ఈ ప్రమాదంలో వెంకటేష్ వాహనంలో చిక్కుకుని అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులకు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నారు.



వాహనంలో ఇరుక్కుపోయిన వెంకటేష్ మృతదేహం

వేడుకగా శివపార్వతుల కల్యాణం



కల్యాణోత్సవానికి కొలువుదీరిన శివపార్వతులు

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా సూళ్లూరుపేటలోని గంగాపార్వతీ సమేత త్రినేత్ర సంభూతుడైన నాగేశ్వరస్వామి ఆలయంలో గురువారం శివపార్వతుల కల్యాణోత్సవం వేడుకగా జరిగింది. శివయ్య, పార్వతుల ఉత్సవ విగ్రహాలను మంగళ వాయిద్యాల నడుమ ఆలయం చుట్టూ ప్రదర్శనగా తీసుకొచ్చి ఆలయ ప్రాంగణంలో ఉన్న కల్యాణ వేదికపై కొలువుదీర్చారు. అనంతరం వేదమంత్రోచ్చరణలు, బాజాభజంత్రీల నడుమ స్వామివారి కల్యాణాన్ని నిర్వహించారు. ముందుగా ఉత్సవ కమిటీ సభ్యులు ముప్పాళ్ల శ్రీహరిరెడ్డి దంపతులు కల్యాణోత్సవానికి సారె సమర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఆకుతోట రమేష్, ఏజీ కిషోర్, మాజీ చెంగాళమ్మ ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ ఎం.వెంకటేశ్వర్లు రెడ్డి, అనిల్ కుమార్ రెడ్డి, ఉత్సవ కమిటి సభ్యులు రాము, రాజశేఖర్, శాంతి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయాల్లో ప్రత్యేక పూజలు

కోట, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్, తిమ్మానాయుడుపాలెం, కోటలోని తూర్పువీధి, బజారు సెంటర్లలో ఉన్న సాయిబాబా ఆలయాల్లో గురువారం ప్రత్యేక పూజలు జరిగాయి. సాయిబాబా విగ్రహాలకు అభిషేకాలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు.